


# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, మంగళవారం 15-02-2022 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 125 పేజీలు : 08 వెల : 1 రూపాయి

# సీఎం జగన్ అధ్యక్షతన రోడ్ సేఫ్టీ కౌన్సిల్ భేటీ..

## పలు కీలక అంశాలకు ఆమోదం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన క్యాంప్ కార్యాలయంలో సోమవారం రహదారి భద్రతా మండలి (ఆంధ్రప్రదేశ్ రోడ్ సేఫ్టీ కౌన్సిల్) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో.. పలు కీలక అంశాలతో పాటు రోడ్డు ప్రమాదాలు జరగడానికి కారణాలు తదితర అంశాలను సీఎంకు అధికారులు వివరించారు. అనంతరం అధికారులకు కొన్ని సూచనలు చేసిన సీఎం జగన్ .. కీలక నిర్ణయాలు కొన్నింటి అమలుకు ఆమోదం సైతం తెలిపారు. ప్రమాదాలకు గురైన వారి ప్రాణాలు కాపాడటం, నిర్ణీత సమయంలో ఆస్పత్రులకు చేర్చడంలో '108' కీలక పాత్ర పోషిస్తున్నాయని అధికారులు సీఎం వైఎస్ జగన్ కు తెలియజేశారు. గోల్డెన్ అవర్‌లోగా వారిని ఆస్పత్రులకు చేర్చడంతో చాలామంది ప్రాణాలు నిలబడుతున్నాయన్న అధికారులు. రాష్ట్ర వ్యాప్తంగా 1190 బ్లాక్ స్పాట్స్ గుర్తించామని, అందులో 520 స్పాట్స్‌ను రెక్టిఫై చేశామని అధికారులు వివరించారు. ఆర్ అండ్ బీ నిర్వహిస్తున్న నేషనల్ హైవేల్లోనూ 78 బ్లాక్ స్పాట్స్‌ను రెక్టిఫై చేసినట్లు అధికారులు తెలిపారు.



### సీఎం వైఎస్ జగన్ సూచనలు

ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఆర్టీసీ, ప్రభుత్వం సహకారంతో కలిపి ఒక డ్రైవింగ్ స్కూలు ఏర్పాటు చేయాలని సీఎం వైఎస్ జగన్ అధికారులకు సూచించారు. అలాగే ఈ సదుపాయాలను

తరువాయి 2లో..

## ఏపీ హైకోర్టు నూతన న్యాయమూర్తులుగా

# ఏడుగురి ప్రమాణ స్వీకారం



అమరావతి: ఏపీ హైకోర్టు నూతన న్యాయమూర్తులుగా ఏడుగురు ఇవాళ ప్రమాణస్వీకారం చేశారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాలులో జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి, జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ వడ్డిబోయిన సుజాత ప్రమాణ స్వీకారం చేశారు.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా వీరితో ప్రమాణం చేయించారు. ఈ ఏడుగురు జడ్జిల ప్రమాణ స్వీకారంతో ఏపీ హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 27కి చేరింది. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరాం, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు జానకి రామిరెడ్డి, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఘంటా రామారావు, అసిస్టెంట్ సోలిసిటర్ జనరల్ హరనాథ్, పలువురు రిజిస్ట్రార్లు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# 'హోదా'పై యుద్ధం చేయకుండా పలాయనవాదమెందుకు?

## సీఎం జగన్‌పై తెదేపా అధినేత ధ్వజం



అమరావతి: ఏపీకి ప్రత్యేకహోదాపై యుద్ధం చేయకుండా పలాయనవాదమెందుకని సీఎం జగన్‌ను తెదేపా అధినేత చంద్రబాబు నిలదీశారు. 'హోదా' కోసం ఎంపీల రాజీనామాలంటూ చేసిన నాటి సవాళ్లు ఏమయ్యాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెదేపా కార్యాలయంలో ఆ పార్టీ వ్యూహకమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాల

తరువాయి 7 లో..

# ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా ప్రవీణ్ ప్రకాశ్



విజయవాడ: ఢిల్లీలోని ఏపీ భవన్ ప్రిన్సిపాల్ రెసిడెంట్ కమిషనర్‌గా ప్రవీణ్ ప్రకాష్ బదిలీ అయ్యారు. సీఎంవో ప్రిన్సిపాల్ సెక్రెటరీగా ఉన్న ప్రవీణ్ ప్రకాష్‌ను.. బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా ఉన్న భావనా సక్సేనాను రిలీవ్ చేస్తూ కేంద్రం నుంచి తాజాగా దేశాలు వెలువడ్డాయి.

ఈ తరుణంలో ప్రవీణ్ ప్రకాశ్‌ను బదిలీ చేస్తూ ఏపీ సీఎస్ సమీర్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు.

# రాష్ట్రంలో రహదారులకు మహర్దశ

- రూ.10401 కోట్లతో 31రహదారులు నిర్మాణం
- పల్లెప్రజలకు శుభవార్త-గ్రామ సచివాలయాల్లో ఏటిఎం సేవలకు శ్రీకారం
- భారీ నౌకాదళ విన్యాసాలకు వేదిక కానున్న విశాఖ
- రాష్ట్రానికి మరో ఎక్స్ ప్రెస్ హైవే 50 వేల కోట్లతో ఏపీ మీదుగా నిర్మాణం
- అబద్ధాల జీవీఎల్ నర్సింహా నిజం చెప్పు చాలు
- ట్విట్టర్ వేదికగా ఎంపీ విజయసాయి రెడ్డి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : రాష్ట్రంలోని రహదారులు శరవేగంతో అభివృద్ధి చెందనున్నాయని, రూ. 10,401 కోట్లతో 741కి.మీ. మేర నిర్మించనున్న 31రహదారులకు కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ, సీఎం జగన్ తో కలిసి ఈనెల 17న శంకుస్థాపన చేస్తున్నారని రాజ్యసభ సభ్యులు, వైకాపా జాతీయ ప్రధాక కార్యదర్శి విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ట్విట్టర్ వేదికగా పలు అంశాలు వెల్లడించారు. రూ.11,157 కోట్లతో ఇప్పటికే నిర్మించిన 20 రహదారులను ప్రారంభించ నున్నారని అన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్న ఈ భారీ కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, సీఎం వైఎస్ జగన్ పాల్గొననున్నారని అన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా పల్లె ప్రజానీకానికి 540 రకాలకుపైగా సేవలను అందిస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు కొత్తగా వాటిల్లో ఏటీఎం సేవలను జోడించిందని అన్నారు. తొలిదశలో జిల్లాకొకటి, అనంతరం క్రమంగా రెవెన్యూ డివిజన్, మండలకేంద్రాల్లో వీటిని అందుబాటులోకి తీసుకురానుందని అన్నారు. ఇప్పటికే 500 సచివాలయాల్లో ఆధార్ సేవలు అందిస్తుందని ఉగాది నాటికి మరో 2,500 సెంటర్లకు ఈ సేవలు

తరువాయి 2లో..

# 17న స్పందనపై జిల్లా స్థాయి వర్క్ షాప్

## సి.ఎం.ఓ. కార్యదర్శి సాలమన్ ఆరోఖ్యరాజ్ హాజరుకానున్నట్లు జేసీ వెల్లడి




విశాఖపట్టణం (విజయభాను న్యూస్) : : ప్రజా వినతుల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని మరింత ప్రయోజన కరంగా తీర్చిదిద్దేందుకు, వినతులకు మెరుగైన రీతిలో నాణ్యమైన పరిష్కారాన్ని చూపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన స్పందన జిల్లాస్థాయి వర్క్‌షాప్ ఈ నెల 17వ తేదీన స్థానిక చిల్డ్రన్ థియేటర్ ఎరీనాలో జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యదర్శి సాల్మాన్ ఆరోఖ్యరాజ్ ఈ సదస్సుకు సమన్వయ అధికారిగా వ్యవహరిస్తారని

తరువాయి 7లో..

# ఏపీలో నైట్ కర్ఫ్యూ ఎత్తివేత..

తాడేపల్లి : ఏపీలో కోవిడ్ వ్యాప్తి తగ్గుముఖం పడుతోంది. పాజిటివ్ కేసుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ఈ క్రమంలో సీఎం వైఎస్ జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో రాత్రి కర్ఫ్యూను ఎత్తివేస్తున్నట్టు తెలిపారు. ప్రతీ ఒక్కరూ మాస్కులు కచ్చితంగా ధరించే నిబంధన అమలు చేయాలని నిర్ణయించారు. దుకాణాలు, వ్యాపార సముదాయాల్లో కోవిడ్ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించేలా చూడాలని అధికారుల్ని సీఎం జగన్ ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫీవర సర్వే కొనసాగించాలన్న సీఎం జగన్.. లక్షణాలు ఉన్నవారికి టెస్టులు చేయాలని అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్య శాఖలో రిక్రూట్‌మెంట్‌ను త్వరగా పూర్తిచేయాలని సీఎం జగన్ ఆదేశించారు. సిబ్బంది తప్పనిసరిగా ఆస్పత్రుల్లో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరిపాలనా బాధ్యతలను అందులో

తరువాయి 7 లో..




# మన పోలీసు వ్యవస్థ దేశానికే ఆదర్శం

- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి
- టూటౌన్ పోలీస్ స్టేషన్ కొత్తభవనం ప్రారంభం

విజయనగరం(విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ పోలీసు వ్యవస్థ దేశానికే ఆదర్శమని, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి శ్రీమతి పాముల పుష్పశ్రీవాణి పేర్కొన్నారు. ఆంధ్రా పోలీస్...ఆదర్శ పోలీస్ అని ప్రశంసించారు. విజయనగరం పట్టణంలోని కొత్తపేట వద్ద నూతనంగా నిర్మించిన టూటౌన్ పోలీస్ స్టేషన్ భవనాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. పోలీసులనుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు.

ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి నేతృత్వంలో మన రాష్ట్ర పోలీసు వ్యవస్థ దేశంలోనే

తరువాయి 2లో..



## సోమవారం డయల్ యువర్ మేయర్ కార్యక్రమం నిర్వహణ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తేదీ.14-02-2022న సోమవారం ఉదయం 10.00 గంటల నుండి 11.00 గంటల వరకు డయల్ యువర్ మేయర్ కార్యక్రమంను టోల్ ఫ్రీ నెంబరు 1800-4250-0009 ద్వారా నిర్వహించ బడుతుందని జివిఎంసి మేయర్ ప్రజలకు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. కావున, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారని తెలిపారు.

## చేపల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన

### - స్పీకర్ తమ్మినేని



ఆమదాలవలస (విజయభాను న్యూస్) : ఆమదాలవలస మండలం కొత్తవలస గ్రామంలో ఫిష్ ఆంధ్ర ఫిట్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా చేపల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం.ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మత్స్య పరిశ్రమకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని అందులో భాగంగా ఫిష్ ఆంధ్ర ఫిట్ ఆంధ్ర కార్యక్రమం లో మినీ రిటైల్ అవుట్లెట్ ద్వారా చేపల అమ్మకాలు పెరిగే విధంగా మినీ రిటైల్ షాపులకు రాయితీల ద్వారా అమ్ముకునేందుకు అవసరమైన పరికరాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారన్నరు. శ్రీకాకుళం మత్స్యశాఖ హబ్ ఆధ్వర్యంలో ఆమదాలవలసలో మూడు షాపులను ఈరోజు ప్రారంభించుకు%శీ%టున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జె డి శ్రీనివాస రావు, ఏ డి సంతోష్ కుమార్, ఎఫ్ డి వో బగాది సురేష్, వి ఎఫ్ ఏ ఈశ్వర్ రావు ఎంపీపీ తమ్మినేని శ్రీరామమూర్తి, వైస్ ఎంపీపీ సోమరాజు జగన్నాధరావు, స్థానిక సర్పంచ్ ప్రతినిధి మెట్ట ఆనందరావు, ఎంపిటిసి కూటికుప్పల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర ఫారెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ తో


## ఆత్మీయ కలయిక



పశ్చిమ గోదావరి,ఉండి (విజయభాను న్యూస్) : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఫారెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్, పశ్చిమ గోదావరి జిల్లా వైసీపీ పార్టీ యూత్ అధ్యక్షులు మంతెన యోగేంద్ర కుమార్ బాబును మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయం లో వైఎస్సార్సీపీ అరివెల్లి బలరాముడు (పాందువ్వ) కలుసుకున్నారు. పుష్ప గుచ్చం అందజేసిన ఆయన రాష్ట్రం తో పాటు ఉండి నియోజక వర్గం లో 2024 లో వైసీపీ జండా ఎగురభోతుందని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలే ఆ విజయానికి కారణం కాబోతున్నాయనీ బలరాముడు అన్నారు. ఆ విజయం ఘన విజయం కావడానికి గ్రామ కమిటీలు ఎంతగానో ఉపయోగపడతాయని, పార్టీ నాయకులు కార్యకర్తలు చుర కత్తిలా తయారు అవ్వడానికి గ్రామ స్థాయిలో పదును పెట్టే అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని నియోజక వర్గం ఇంచార్జీ గోకరాజు రామరాజు దృష్టి కి తీసుకువెళ్లాలని, నియోజక వర్గం లో పూర్తి స్థాయి తెదేపా తన ఓటు బ్యాంక్ ను కోల్పోవడానికి ఈ కమిటీలు ఉపయోగ పడతాయని అన్నారు. గ్రామ కమిటీ లు జూన్ లో వచ్చేట్టు చూస్తామని, గోకరాజు రామరాజు దృష్టి కి తీసుకువెల్లి తప్పకుండా పరిష్కారం చేస్తామని, మీ యువత ఇలానే రాజకీయాల్లో ముందుకు సాగాలని మంతెన యోగేంద్ర కుమార్ బాబు (కొరుకొల్లు బాబు) అన్నారు. పలు అంశాలు ఆయనతో చర్చించినట్టు బలరాముడు పేర్కొన్నారు.

# ఉద్యోగ కల్పన లో పల్సస్ మొదటి స్థానం

### - డిజిటల్ మార్కెటింగ్ శిక్షణ ఉపాధి కల్పన - పల్సస్ సీఈఓ డాక్టర్ శ్రీను బాబు గెదల



విశాఖ సిటీ (విజయభాను న్యూస్) : యువశక్తికి ప్రోత్సాహం, నైపుణ్య శిక్షణ, ఉపాధి కి రక్షణ అనే ఆశయంతో పల్సస్ సంస్థ ను స్థాపించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా తాము ముందుకు సాగుతున్నామని ఆ సంస్థ సీఈవో డాక్టర్ గేదెల శ్రీను బాబు అన్నారు.పల్సస్ దినదినాభివృద్ధి చెందుతూ ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తూ ప్రతి ఏటా కొత్త ఉద్యోగాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.విశాఖలో 3ఏళ్ల క్రితం పల్సస్ ఏర్పాటుచేసి 3500 మందికి ఉపాధి కల్పించామన్నారు. స్కిల్ డెవలప్మెంట్ డిజిటల్ మార్కెటింగ్ లో యువతకు శిక్షణ ఇచ్చి భవిష్యత్తులో కంపెనీ ఉత్పత్తులను ప్రచారం చేసే విధంగా ముందుకు సాగుతుంది అన్నారు.

సోమవారం ఉదయం విశాఖ నగరంలోని చిల్డ్రన్స్ ఎరెనా లో జరిగిన పల్సస్ సంస్థ 14వ వార్షికోత్సవంలో భాగంగా ఉద్యోగులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీనుబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

కొత్త డిజిటల్ ఐటి హబ్ మధురవాడ ఐటీ పార్క్ లో నెలకొల్పుతున్నట్టు తెలిపారు. మహిళా ఉద్యోగులకు ప్రాధాన్యత ఇచ్చి అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. 60 శాతం మంది మహిళా ఉద్యోగులు ఉన్నారన్నారు.2021 సంవత్సర లో 3500 వెబినార్ లు, 700 జర్నల్స్ ప్రచురించామన్నారు. ప్రస్తుతం 7 సెజ్ ల్లో 5 నుంచి 6 వేల మంది ఉద్యోగులకు ఉపాధి కల్పించామన్నారు. రానున్న కాలంలో మరో పది వేల ఉద్యోగులను నియమించనున్నట్లు తెలిపారు. ఉద్యోగాలు ఇవ్వటమే కాకుండా వారిని కుటుంబ సభ్యుల్లాగ చూసుకుని వారి ఆరోగ్య పరిరక్షణ కోసం అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఒమిక్స్,పల్సస్ ప్రపంచవ్యాప్తంగా సైన్స్, టెక్నాలజీ, ఔషధ శాస్త్ర రంగాల్లో పరిశోధనకు అవసరమైన విషయాలను ఇంటర్నెట్ ద్వారా అందుబాటులో ఉంచుతుందని తెలిపారు. ప్రపంచం వ్యాప్తంగా వేలాది ఇంటర్నేషనల్ సెమినార్లు ఏర్పాటు చేసి ప్రముఖుల ప్రశంసలు పొందారు.

విద్యను విజ్ఞానంగా మార్చి పరిశోధలనే పరిశ్రమగా తీర్చిదిద్ది ,సంపదను సృష్టించేందుకు వేల ఉద్యోగాలు కల్పించేందుకు ఒక లక్ష్య సాధనతో ముందుకు వెళు న్నామన్నారు.

తాను ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్డి పొంది అమెరికాలోని స్టాండ్ ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి పాతికేళ్లకే పోస్ట్ డాక్టరేట్ సాధించి యువ శాస్త్రవేత్త గా ప్రపంచ దేశాల అన్నింటిలో భారత దేశ గౌరవాన్ని పేరుప్రఖ్యాతులను సాధించే విధంగా కృషి చేశారు ప్రతి విద్యార్థి తనలాగే పెద్ద చదువులు చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. తాను కూడా అ ఒక సామాన్య కుటుంబం నుంచే వచ్చానన్నారు.

ప్రస్తుతం పల్సస్ అమెరికా, సింగపూర్ , బ్రిటన్, బెల్జియం దేశాల్లోనే కాకుండా భారతదేశంలో విశాఖ,హైదరాబాద్ ,చెన్నై గురుగావ్ నగరాలకు విస్తరించిందని చెప్పారు. రానున్న కాలంలో మరిన్ని ముఖ్య నగరాల్లో పల్సస్ సంస్థ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో భాగంగా పల్సస్ సీఈవో డాక్టర్ శ్రీనుబాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రాజకీయ ప్రముఖులు ఆయన్ని సత్కరించారు.

ఉద్యోగులు ఆయన్ను ఘనంగా ఘజ మాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. పల్సస్ సంస్థ ప్రతినిధి గేదెల శంకర్రావు మాట్లాడుతూ మధురవాడ టైటిల్ను 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ క్యాంపస్, రెండు లక్షల యాభై వేల చదరపు అడుగుల విస్తీర్ణం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మరియు పల్స సె సిబ్బంది సంస్థ విభాగాధిపతులు పాల్గొన్నారు.



మొదటి పేజీ తరువాయి

## సీఎం జగన్ అధ్యక్షతన రోడ్ సేఫ్టీ కౌన్సిల్ భేటీ..

ఆర్టీసీ వినియోగించుకోవడంతో పాటు, డ్రైవింగ్ శిక్షణ కోసం కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. ట్రామా కేర్ సెంటర్లను కొత్త జిల్లాలకు అనుగుణంగా ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేయాలని, కొత్తగా ఏర్పాటు చేస్తున్న 16 మెడికల్ కళాశాలల్లో కూడా ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అత్యాధునిక పద్ధతుల్లో ఎమర్జెన్సీ సర్వీసులు అందించాలన్న సీఎం. ప్రమాదాలకు గురైన వారు కోలుకునేందుకు వీలుగా వైజాగ్లో రీహాబిలిటేషన్ సెంటర్ను ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. ఇక తిరుపతి బర్డ్ ఆస్పత్రుల్లో ఉన్న సెంటర్ సదుపాయాల్ని మెరుగుపరచాలని సీఎం ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలకు అధికారులు పలు కారణాలు వివరించగా.. సీఎం జగన్ పలు సూచనలు సైతం చేశారు. ప్రమాదాలను నివారించేందుకు రోడ్లపై లేన్మార్కింగ్ చాలా స్పష్టంగా ఉండేలా చూడాలని, బైక్లకు ప్రత్యేక లేన్, ఫోర్వీల్ వాహనాలకు ప్రత్యేక లేన్స్ ఏర్పాటుపై ఆలోచన చేయాలని తెలిపారు. అలాగే ఎంత స్పీడులో పోవాలనే దానిపై సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్ల పక్కన ధాబాల్లో మద్యం అమ్మకాలు జరగకుండా చూస్తూ.. ప్రమాదాలు చాలావరకు తగ్గుతాయని అధికారులకు సీఎం సూచించారు. ప్రధాన రహదారులు, ముఖ్యమైన రోడ్ల పక్కన యాక్సెస్ బారియర్స్ ఉండాలని, ఈ మేరకు చర్యలు చేపట్టాలని అధికారుల్ని సీఎం జగన్ కోరారు.

అలాగే డ్రైవింగ్ లైసెన్స్ విధానాన్ని పునఃసమీక్షించాలన్న సీఎం వైఎస్ జగన్ రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై క్రమం తప్పకుండా సమీక్ష చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల వారీగా ఏర్పాటవుతున్న కమిటీలు కూడా రోడ్డు ప్రమాదాలపై సమీక్ష చేయాలని, ఆశించిన ఫలితాలు రావాలంటే జిల్లా కమిటీలు తీసుకుంటున్న చర్యలపై కూడా అధికార గణం సమీక్ష చేయాల్సిందేనని కోరారు .

**పలు నిర్ణయాలకు గ్రీన్సిగ్నల్**

రోడ్ సేఫ్టీ మీద లీడ్ ఏజెన్సీ ఏర్పాటుకు పచ్చ జెండా. పోలీసు, ట్రాన్స్పోర్ట్, హెల్త్ & రోడ్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ నుంచి నిపుణులు ఇందులో ఉంటారు.

**రోడ్ సేఫ్టీ ఫండ్ ఏర్పాటుకు గ్రీన్సిగ్నల్**

ప్రమాద బాధితులకు చికిత్స కోసం క్యాష్లెస్ ట్రీట్ మెంట్ అందేలా నెట్వర్క్ ఆస్పత్రుల జాబితాలోకి ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయం రోడ్డు ప్రమాద బాధితులను ఆస్పత్రులకు తీసుకొచ్చే వారిపట్ల మంచి ప్రోత్సాహం అందించాలన్న ఐరాడ్ యాప్ వినియోగించుకుని ప్రమాదాలపై లైవ్ అప్డేట్ పొందేలా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలి పీపీపీ పద్ధతిలో రవాణాశాఖద్వారా ఆటోమేటెడ్ ఎఫ్సీ టెస్టింగ్ ఏర్పాటుపై కార్యాచరణ. రోడ్డు ప్రమాద బాధితులకు బీమా పరిహారం దక్కేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

ఈ సమీక్షా సమావేశంలో రహదారులు, భవనాల శాఖ మంత్రి ఎం శంకర నారాయణ, సీఎస్ డాక్టర్ సమీర్ శర్మ, రెవెన్యూశాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, రవాణా శాఖ ముఖ్యకార్యదర్శి ఎం టీ కృష్ణబాబు, హెూంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్, లా సెక్రటరీ వి సునీత, రవాణాశాఖ కమిషనర్ పి సీతారామాంజనేయలు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రహదారులకు మహర్దశ

విస్తరించనున్నాయని అన్నారు.

భారీ నౌకాదళ విన్యాసాలకు విశాఖపట్నం వేదిక కాబోతోందని, ఈనెల 21న ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ, 25 నుంచి మార్చి 4 వరకూ మిలాన్-2022 విన్యాసాలు, 27న ఇంటర్నేషనల్ పరేడ్ జరుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఐఎన్ఎస్ విశాఖ యుద్ధనౌకను సీఎం వైఎస్ జగన్ జాతికి అంకితం చేయనున్నారని అన్నారు. రాష్ట్రంలో మరో గ్రీన్ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవే రానుందని, రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పారిశ్రామికాభివృద్ధికి ఊతమిచ్చేలా చెన్నై సూరత్ కారిడార్ కు ఎన్ హెచ్ ఏ ఐ ఆమోదం తెలిపిందని అన్నారు. తూర్పు, పశ్చిమ పోర్టులను అనుసంధానించే ఈ కారిడార్ లో 320 కి.మీ. ఏపీలో నిర్మించనున్నారని అన్నారు. రూ.50 వేల కోట్లతో నిర్మించనున్న చెన్నై సూరత్ ఎక్స్ ప్రెస్ హైవే ఏపీలో తిరుపతి, కడప, కర్నూలు మీదుగా 320 కి.మీ నిర్మాణం కానుందని అన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలో మేం 22 మంది లోక్ సభ సభ్యుల్ని గెలుచుకోవటం వల్ల మీరు ఏపీకి న్యాయం చేయటం లేదా? లేక మీ పార్టీకి 301 రావటం వల్ల ఏపీకి న్యాయం చేయటం లేదా? రాష్ట్రం కోసం మేం అడగనిది లేదు. మీరు ఏం ఇచ్చారన్నది చెప్పండి చాలు అయ్యా అబద్దాల నరసింహ అంటూ రాజ్యసభ సభ్యుడు జీ వి ఎల్ నరసింహా రావు పై ఎదురుదాడికి దిగారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి తాత్కాళిక సభ్యురాలు డాక్టర్ పూనమ్ గుప్తాతో తన అద్యక్షతన వాణిజ్య కమిటీ పరస్పర చర్చ నిర్వహించడం జరిగిందని ఈ సందర్భంగా గుప్త భారతదేశ ఎగుమతులు, దిగుమతులకు సంబంధించి విశ్లేషణాత్మక వివరణతో పాటు విలువైన సలహాలు, సూచనలు అందించడం జరిగిందని అన్నారు. ప్రపంచ వాణిజ్యంలో భారతదేశం తన పరిధిని ఏవిధంగా విస్తరించుకోవాలో సూచించారని అన్నారు. చంద్రబాబుని పిలిచి పీట వేసి, బొట్టు పెట్టలేదని కోపంతో పచ్చ మీడియా ఆధ్యాత్మిక గురువులపైనా విషం చిమ్ముతోందని అన్నారు. ధార్మిక సంస్థల సందర్శనకు ఆహ్వానాలు అవసరం లేదని, ఎవరైనా వెళ్లి రావచ్చని అన్నారు. పచ్చ మీడియా దృష్టిలో బాబు గారు దేవుడి కంటే ఉన్నతుడని, అందుకే అవమానంగా ఫీలవుతున్నట్టుందని అన్నారు.

## మన పోలీసు వ్యవస్థ దేశానికే ఆదర్శం




అత్యుత్తమమైనదిగా పేరు తెచ్చుకున్నదని కొనియాడారు. మన డిజిపి గౌతమ్ సమాంగ్ దేశంలోనే ఉత్తమ డిజిపిగా ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. నేర నియంత్రణతోపాటు మహిళల రక్షణ, భద్రత మన పోలీసులకు ప్రథమ కర్తవ్యాలని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 14వేల మంది మహిళా పోలీసులను నియమించి, మహిళలు, పిల్లలపట్ల దౌర్జన్యాలు, దాడుల నియంత్రణకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు. దిశ చట్టం, దిశ యాప్ మహిళల భద్రతకు భరోసానిస్తున్నాయని పేర్కొన్నారు. ఒకప్పుడు పోలీసు స్టేషన్కు రావడానికి మహిళలు భయపడేవారని, ఇప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేస్తున్నారని అన్నారు. పోలీసులు నీతి నిజాయితీతో పనిచేస్తూ, ధర్మంవైపు నిలబడాలని పుష్ప శ్రీవాణి కోరారు. రాష్ట్ర డిజిపి దామోదర్ గౌతమ్ సవాంగ్ మాట్లాడుతూ, పోలీసులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని, సామాన్యులకు సేవలందించాలని కోరారు. ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తూ, ఉద్యోగాలకు వన్నె తేవాలని సూచించారు. మహిళలు, పిల్లలు, బడుగు బలహీన వర్గాలు, సామాన్యులకు సక్రమంగా పోలీసు సేవలు అందించినప్పుడే, పోలీసు వ్యవస్థ అసలు లక్ష్యం నెరవేరుతుందని స్పష్టం చేశారు. మహిళల భద్రత, రక్షణతోపాటు వారి సాధికారత కోసమే, ప్రభుత్వం మహిళా పోలీసు వ్యవస్థను ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ లక్ష్యాల సాధనకోసం మహిళా పోలీసులంతా కృషి చేయాలని సూచించారు. పోలీసు శాఖ ప్రతినిధిగా, మహిళా పోలీసుల పాత్ర ఇప్పుడు ఎంతో కీలకంగా మారిందని, అంకితభావంతో కృషి చేసి, శాఖకు మంచి పేరు తేవాలని డిజిపి కోరారు.ఈ కార్యక్రమంలో జెడ్పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఎంఎల్సిలు ఇంధుకూరి రఘురాజు, పాకలపాటి రఘువర్మ, ఎంఎల్ఏ కోలగట్ల వీరభద్రస్వామి, విశాఖ రేంజ్ డిఐజి ఎల్.రంగారావు, ఎస్పి దీపికా పాటిల్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# యువత అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుంది




మాట్లాడుతున్న రుత్తల యర్రాపాత్రుడు

మాకవరపాలెం (విజయభాను న్యూస్): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్ర విశాఖపట్నం వారి సౌజన్యంతో హెల్ప్ రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ, లిఫ్ట్ రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో జల్ జాగరన్ అభియాన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన హెల్ప్ రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ గౌరవ అధ్యక్షులరుత్తల యర్రాపాత్రుడు మాట్లాడుతూ దేశంలో ప్రవేశపెట్టే ఏ పథకం అయిన యువత అభివృద్ధి కోసమే నన్నారు. వారు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి అయినట్టేనన్నారు. ప్రభుత్వ కళాశాల సివిక్స్ లెక్చరర్ త్రిమూర్తులు మాట్లాడుతూ నేటి దేశానికి నీటి వనరులు యొక్క అవశ్యకతను వివరించి నీటిని పొదుపు చేసేందుకు ఆదర్శంగా యువత తయారు కావాలని తెలిపారు. ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం బి.అచ్యుత రామయ్య మాట్లాడుతూ గ్రామంలో యువత నీటిని పొదుపు చేసే పద్ధతులు అవలంబిస్తే భూమికి నీటి కొరత అనేది ఉండదని తెలిపారు. మాకవరపాలెం రిసోర్స్ పర్సన్ రామకృష్ణ మాట్లాడుతూ జల జాగరణ అంటే నీటిని పొదుపు చేసేందుకు ప్రజలు జాగృత కలిగి ఉండాలని అందుకు యువతే ముందు నిలబడి మార్గదర్శకం కావాలన్నారు. లిఫ్ట్ రూరల్ డెవలప్ మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి సిహెచ్‌వి ఎస్ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేర్చి దేశ ప్రగతికి యువతను భాగస్వామ్యం చేయడమే మా యొక్క పాత్ర అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాకవరపాలెం వైస్ ప్రెసిడెంట్ లాలం రాము, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీను, కానిస్టేబుల్ శివ, హెల్ప్ రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ సెక్రెటరి జి.అప్పారావు, లిఫ్ట్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సీనియర్ అడ్వైసర్ వి.ఎ.రావు, శ్రీవేమ యువజన సేవా సంఘం అధ్యక్షుడు బోలెం శివ, గోల్డెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బంగారు ప్రసాద్, నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్లు సత్యసాయి, మణికంత, గోవిందలు గ్రామ యువతీ యువకులు, మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

# రహదారులు బాగుచేయాలని జోన్- 6 జెడ్సీ కు వినతి



గాజువాక: (విజయభాను న్యూస్ ): గాజువాక జగ్గుజంక్షన్ నుంచి గంగవరం పోర్టు రోడ్డు వైజంక్షన్ వరకు ప్రమాదకరంగా మారిన రోడ్డు మరమ్మత్తులు చేయాలని,వీధిదీపాల ఏర్పాటు, కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతూ స్పందన కార్యక్రమం లో భాగంగా జోన్ 6 జోనల్ కమీషనర్ శ్రీధర్ కు సోమవారం అఖిలభారత మానవహక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాగారపు శ్రీను వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా జాగారపు శ్రీను మాట్లాడుతూ విశాఖ నగరానికి తలమానికంగా అభివృద్ధి చెందుతూ నగర అభివృద్ధి బాటలోను, వివిధ ఆదాయమార్గాల ద్వారా ప్రభుత్వ ఖాజానాను నింపటంలోనూ ముందు వరుసలో నిలుస్తున్న గాజువాక ప్రాంతంలో స్థానిక జగ్గుజంక్షన్ నుండి గంగవరంపోర్టు రోడ్డులోని వైజంక్షన్ వరకు గల రహదారి గత మూడేళ్లనుంచి గుంతలమయంగా మారి అనేక ప్రమాదాలకు వేదికగా మారుతోందని తెలియజేయటానికి చింతిస్తున్నామని అన్నారు. ఇప్పటికే వందలాది భారీవాహనాల రాకపోకలతో దారుణమైన పరిస్థితికి చేరుకున్న ఈ రోడ్డులో పూర్తిస్థాయిలో వీధిలైట్లు లేకపోవటం ఉన్నలైట్లు కూడా పనిచేయకపోవటంతో ఆ దారిలో రాత్రిపూట ప్రయాణం చేయటం ప్రాణాలతో చెలగాటంగా మారుతోంది. ఇప్పటికే పదుల సంఖ్యలో వాహనప్రమాదలకు నెలవుగా మారిన ఆ రోడ్డులో పలువురు ప్రాణాలు కోల్పోయినా నేటికీ సమస్యకు పరిష్కారం దొరకటం లేదు. అంతేకాకుండా వివిధ ప్రాంతాలనుంచి గంగవరం పోర్టుకు వెళ్లే భారీ వాహనాల నుండి జారిపడే బొగ్గు,ఇతర పదార్థాల కారణంగా చుట్టుపక్కల ప్రాంతాలన్నీ కాలుష్యమయమవుతున్నాయి. ఆయా భారీవాహనాల యజమానులు, సిబ్బంది నిబంధనలకు వ్యతిరేకంగా వాహనాలపై తరలించే పదార్ధాలను కప్పిఉంచకపోవటం సహా గంగవరం పోర్టు యాజమాన్యం సైతం ఆ రోడ్డులో కాలుష్యాన్ని నియంత్రించేందుకు గాను రోడ్లపై దూళిని తొలగించడం, దుమ్ముదూళి గాలిలో రేగకుండా వాహనాల ద్వారా నీటిని చిమ్మటం వంటి చర్యలు చేపట్టకపోవటం కారణంగా స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోడ్డు మరమ్మత్తులు, వీధిలైట్ల ఏర్పాటు, కాలుష్య నియంత్రణపై దృష్టిసారించాలని ఆయాసమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు తెలియజేశారు.

## చిన్నారుల్లో కాన్సర్ నివారణకు
# మహాత్మాగాంధీ కాన్సర్ హాస్పిటల్ విశేషంగా కృషి చేస్తోంది


### ఓమ్ని ఆర్కే మానేజింగ్ డైరెక్టర్,ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ రాధాకృష్ణ



అక్కయ్యపాలెం (విజయభాను న్యూస్): చిన్నారుల్లో కాన్సర్ నివారణకు మహాత్మాగాంధీ కాన్సర్ హాస్పిటల్ విశేషంగా కృషి చేస్తోందని ఓమ్ని ఆర్కే మానేజింగ్ డైరెక్టర్,ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ రాధాకృష్ణ కొనియాడారు.విశాఖపట్నం ఎంవీపీ కాలనీ మహాత్మాగాంధీ కాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ఇన్‌స్టిట్యూట్ లో అంతర్జాతీయ బాల్య కాన్సర్ దినోత్సవాన్ని కాన్సర్ నుంచి కోలుకున్న చిన్నారుల మధ్య నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన రాధాకృష్ణ మాట్లాడుతూ కాన్సర్ బారిన పడిన చిన్నారులకు బాసటగా నిలుస్తూ మెరుగైన వైద్యం అందిస్తూ వారిలో ధైర్యం నింపు తున్నారని ప్రశంసించారు.మహాత్మాగాంధీ కాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ఇన్‌స్టిట్యూట్ చీఫ్ అంకాలజిస్ట్ డాక్టర్ బీ.రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతీ మూడు నిమిషాలకు ఒక చిన్నారి కాన్సర్ తో ప్రాణాలు కోల్పోతున్నారని,కౌమార దశలో మరణాలకు కాన్సర్ ముఖ్య కారణమన్నారు.బాల్య కాన్సర్ నివారణకు ఖచ్చితమైన రోగనిర్ధారణ,నాణ్యమైన చికిత్స ముఖ్యమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మానేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ వున్న,డాక్టర్ బీ.చంద్రశేఖర్,డాక్టర్ ప్రవీణ్ వున్న,డాక్టర్ రజనీ ప్రియా,డాక్టర్ వెంకటేశ్వర రావు,కాన్సర్ నుంచి కోలుకున్న చిన్నారులు వారి తల్లితండ్రులు,పలు స్వచ్చంద సేవా సంస్థలు,శ్రేయ కాన్సర్ ఫౌండేషన్,ఏ ఆర్ ఓ హెచ్,కెట్టో,మిలాప్ వంటి నిధుల సేకరణ ప్రచారాలు నిర్వహించారు.

## మండల ఫుడ్ విజిలెన్స్ కమిటీ సభ్యుల నియామకం





తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మాకవరపాలెం (విజయభాను న్యూస్) : జిల్లా వినియోగదారుల సంఘాలు సమైక్య విశాఖపట్నం చైర్మన్ మర్రి సత్య నారాయణ ఆధ్వర్యంలో మాకవరపాలెం వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, ఆర్.రత్నవేణి, వరహాలదొరలను మండల ఫుడ్ విజిలెన్స్ కమిటీ సభ్యులను ఏర్పాటు చేసి ప్రతి మూడు నెలలకు ఒకసారి మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలపై పిర్యాదులు తెలుసు కోవాలని జిల్లా వినియోగదారుల సంఘం చైర్మన్ మర్రి సత్యనారాయణ మాకవరపాలెం తహశీల్దార్ రాణీఅమ్మాజీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు గొర్లి రాఘవులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన విద్యార్థుల విభాగం కన్వీనర్ గా ఎన్నికైన అంగనైని ఆనంద్

- ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఉప్పర అశోక్ కుమార్
- ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గంలో పాడేరు నుంచి నలుగురికి చోటు





పాడేరు:(విజయభాను న్యూస్) : ఈనెల 13వ తేదీన విజయవాడలో జరిగిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 40వ రాష్ట్ర మహాసభలు (ప్రతినిధి సభలు ) లో పాడేరు నుంచి నలుగురికి రాష్ట్ర కార్యవర్గంలో చోటు లభించింది. ఈ రాష్ట్ర కార్యవర్గంలో ఏబీవీపీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గిరిజన విద్యార్థుల విభాగం కన్వీనర్ గా అంగనైని ఆనంద్ ఎన్నికైయారు. ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఉప్పర అశోక్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా దొర రామయ్య, వంతల భగవాన్ రాజు కు, ఎన్నికైన్నటు పాడేరు జిల్లా కన్వినర్ పాతుని రవికిరణ్ పాత్రుడు తెలిపారు. ఈ సందర్బంగా నూతనంగా ఎన్నికైన వారు మాట్లా డుతూ ప్రస్తుత రాష్ట్రంలో ఉన్న విద్యారంగా సమస్యల పైన నిరంతరం పోరాటం చేస్తామని, అలాగే మా మీద నమ్మకంతో బాధ్యతలు అప్ప గించిన ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులకు ప్రత్యేక ధన్యవాదలు తెలుపుతున్నామని అన్నారు. వీరికి ఏబీవీపీ జిల్లా ప్రముఖ్ ఎం.ఎం. ల్. పాత్రుడు, కళామంచ్ విభాగ్ కన్వినర్ గెమ్మెలి కళ్యాణ్, కళామంచ్ జిల్లా కన్వినర్ పూజారి కళ్యాణ్ కుమార్, తోటి విద్యార్థులు, పలువురు అభినందించారు.

## అభివృద్ధికి కేరాఫ్ గా
# ముత్యాలమ్మ పాలాన్ని తీర్చిదిద్దుతా
### ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల



పరవాడ (విజయభాను న్యూస్) : ముత్యాలమ్మ పాలెం గ్రామ పంచాయితీనీ మండలము లోనే అభివృద్ధికి కేరాఫ్ గా తీర్చి దిద్దుతాను అని ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు తెలిపారు. పరవాడ మండలం ముత్యాలమ్మ పాలెం గ్రామ పంచాయతీ లో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఆశీస్సులతో ముత్యాలమ్మ పాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు దగ్గర వుండి సిసి డ్రెయినేజీ కాలువలు మరియు సి.సి.రోడ్లు శరవేగంగా నిర్మాణం పనులను చేపట్టారు. గ్రామ పంచాయితీలో ప్రజలుకు ఏసమస్య వచ్చిన నాఇంటి గుమ్మం ఎల్లప్పుడూ తెరిచే ఉంటుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, చింత కాయల మసేను ,మాజీ కోపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, చింతకాయల బండ అప్పయ్య, సూరాడ పెంటయ్య, అర్జిల్లి తాతారావు, అర్జిల్లి సోముబాబు, చింతకాయల నూకరాజు, చింతకాయల బుజ్జి ,చింతకాయల సన్యాసిరావు తదుపరి నాయకులు పాల్గొన్నారు.

# ఓపెన్ స్కూల్ ను సందర్శించిన
### రాష్ట్ర కో ఆర్డినేటర్ శివ కోటేశ్వర రావు




భీమునిపట్నం (విజయభాను న్యూస్) : ఓపెన్ స్కూల్ విద్యను సంబంధిత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ శివ కోటేశ్వర రావు అన్నారు.స్థానిక ప్రభుత్వ హై స్కూల్ లో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు .రెండు వందల. మంది పదవ తరగతి విద్యార్థులు 120 మంది ఇంటర్ విద్యార్థులు చదువు చున్నారని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ సురేష్, ప్రదానోపా ద్యాయునీ ఎం శివ రాణి ఉపాధ్యాయులు సుబ్రమణ్యం రాజు,అప్పారావు, శివ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సచివాలయాలను ప్రారంభించిన ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే యు.వి రమణమూర్తి రాజు (కన్నబాబురాజు) , మాజీ డీసీసీబీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ (తేజ) చేతుల మీదగా అచ్యుతాపురం మండలం వుప్పవరం, ఎం జగన్నాధపురం గ్రామాలలో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన సచివాలయ భవన సముదాయాలను సోమవారం ప్రారంభించారు . అనంతరం ఓటిఎస్ లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబురాజు , తేజలను సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటరీలు పూల గుచ్ఛంలతో ఘన స్వాగతం పలికారు . ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోనా సంధ్య బుజ్జి , జడ్పీటిసీ లాలం రాంబాబు, కో-ఆప్షన్ జడ్పీటిసీ నర్మాల కుమార్, సర్పంచ్ లు కూండ్రపు విమలా నాయుడు, దేశంశెట్టి శంకరరావు, ఎంపీటీసీలు ద్వారపురెడ్డి వెంకటలక్ష్మి బాబ్జి , లాలం శ్రీను, నాయకులు తోట వెంకటేష్ , ఆయా గ్రామ సర్పంచ్ లు , ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రం సమస్యల పరిష్కారానికి కృషి



పునాదిని పరిశీలిస్తున్న ఎంపీపీ

కొయ్యూరు (విజయభాను న్యూస్) : కొయ్యూరు మండలానికి చెందిన అతి మారుమూల గ్రామం లూసాంలో అంగనవాడీ భవనం లేక చాలా సమస్యగా ఉందని వచ్చిన వినతిపై కొయ్యూరు ఎంపిపి బడుగు రమేష్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన పునాది నిర్మించి వదిలేసిన పరిస్థితి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునాది నిర్మించి వదిలేసిన గత పాలకులకు ఇది కనబడకపోవడం గమనార్హమన్నారు. నేడు ఈ సమస్యను కచ్చితంగా శాసనసభ్యుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్దానిక అంగన్వాడి టీచర్, తాతారావు గ్రామస్థులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## భావితరానికి బంగరుబాటలు

రేపటి ఉద్యోగాలకు అత్యవసరమైన నైపుణ్యాలను గుర్తించడం, నేటి విద్యార్థుల్లో వాటికి ప్రోదిచేసేలా కార్యాచరణ రూపొందించడం, ఆ మేరకు పిల్లల సామర్థ్యానికి పదును పెట్టడం- నవతరం భవితకు బంగరుబాటలు వేసే విశిష్ట విధానాలివి. సింగపూర్, జర్మనీ ప్రభృత దేశాలు ఆ మేరకు ప్రత్యేక కార్యక్రమాలతో తమ విద్యార్థులను ప్రణాళికాబద్ధంగా సానపడు తున్నాయి. తద్భిన్నంగా కాలంచెల్లిన పాఠ్యప్రణాళికలతో దేశీయంగా చదువులు చట్టుబండలవుతున్నాయి. భారతీయ పరిశ్రమల సమాఖ్య భాగస్వామ్యంతో 'వీబాక్స్' సంస్థ వెలువరించిన 'ఇండియా నైపుణ్యాల నివేదిక-2021' ప్రకారం- దేశవ్యాప్తంగా నూతన ఎంసీఏ పట్టభద్రుల్లో ఉద్యోగాలు సాధించగలిగిన సమర్థులు కేవలం 22శాతం. పాలిటెక్నిక్ పరిస్థితీ అధ్వానమే! దాన్ని పూర్తిచేస్తున్న వారిలో మూడొంతుల మంది తగిన నైపుణ్యాలను ఒడిసిపట్టలేకపోతున్నారు. ఎంబీఏ, ఇంజినీరింగ్ విద్యార్థుల్లో సగంమందికి పైగా సామర్థ్యాల లేమితో ఉద్యోగాల సాధనలో వెలాతెలాపోతున్నారు. 'భారతరత్న' సీఎన్ఆర్ రావు గతంలో ఉద్ఘాటించినట్లు- పాఠ్యాంశాల నవీకరణలో చురుగ్గా వ్యవహరించని విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలదే ఈ పాపం! పాఠ్యపుస్తకాల నుంచి పరీక్షల నిర్వహణ వరకు మేటవేసిన పలు సమస్యలతో బడి చదువులూ అదే తీరుగా వట్టిపోతున్నాయన్నది యథార్థం. కొవిడ్ మహమ్మారి విజృంభించి విద్యాప్రమాణాలు మరీ దిగనాసిపోయిన దుస్థితిలో... 2022-23 విద్యాసంవత్సరానికి బోధనా ప్రణాళికల హేతుబద్ధీకరణకు జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) సమాయత్త మవుతోంది. సంక్షోభ సమయంలో పిల్లలపై భారం తగ్గించేందుకు పాఠ్యపుస్తకాల్లో మార్పులుచేర్పులు చేయాలని ఆ సంస్థ తాజాగా నిశ్చయించింది. తరగతి గదిలో మూసవిధానాల దుష్ఫలితంగా భారతీయ విద్యార్థుల్లో అత్యధికులు జ్ఞానార్జనలో విఫలమవుతున్నారని యునిసెఫ్ లోగడే హెచ్చరించింది. దేశాభివృద్ధికి విఘాతకరమైన ఆ దురవస్థ తొలగిపోవాలంటే- అన్ని స్థాయిల పాఠ్యప్రణాళికలూ ఎప్పటికప్పుడు నవ్యతను సంతరించుకోవాలి. మార్కులు, ర్యాంకులే లక్ష్యంగా సాగే బట్టీ చదువుల్ని వదిలిపెట్టి భావితరానికి జీవన నైపుణ్యాలను అందించే మేలిమి విద్యావ్యవస్థను కొలువుతీర్చాలి! చిన్ననాటి నుంచే వృత్తివిద్యలను బోధిస్తే, ఏ దశలో చదువుకు దూరమైనా పిల్లలు తమ కాళ్లపై తాము నిలబడగలరన్నది మహాత్ముడి మేలిమి సూచన. దశాబ్దాలుగా దాన్ని నిర్లక్ష్యం చేసిన పాలకుల పుణ్యమా అని దేశీయ యువశక్తి నీరుగారిపోతూ, నిరుద్యోగ భూత కబంధ హస్తాల్లో విలవిల్లాడుతోంది. సమగ్ర శిక్షా పథకం కింద దేశవ్యాప్తంగా 14 వేలకు పైగా పాఠశాలల్లో దాదాపు 16 లక్షల విద్యార్థులకు వృత్తివిద్యా బోధన కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వం ఇటీవల లోక్‌సభలో ప్రకటించింది. దేశీయంగా మొత్తం బడిపిల్లల సంఖ్య(పాతిక కోట్ల మందికి పైగానే)తో పోలిస్తే అది చాలా స్వల్పం. పాఠశాలల్లో వృత్తివిద్యలను సమధికంగా ప్రోత్స హిస్తూనే- డిగ్రీ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన 'జీవన్‌కౌశల్' ప్రణాళికను పూర్తిస్థాయిలో పట్టాలకు ఎక్కించాలి. 21వ శతాబ్ది నైపుణ్యాలైన సృజనాత్మకత, విమర్శ నాత్మక బుద్ధి కుశలత, సాంకేతిక ప్రజ్ఞ, సంభాషణ, సమస్యా పరిష్కార సామర్థ్యాలను విద్యార్థుల్లో ఇనుమడింపజేసేలా పాలకుల కార్యాచరణ పదునుతేలాలి. 2030 నాటికి 30 కోట్ల మంది భారతీయ యువతీ యువకు లకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రైస్‌వాటర్‌కూపర్స్, యునిసెఫ్ ఇటీవల ముందుకొచ్చాయి. కనీస మౌలిక వసతులు, ఉపాధ్యాయుల కొరతతో కునారిల్లుతున్న పాఠశాలల స్థితిగతులు సత్వరం మెరుగు పడితేనే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పునాదులు పటిష్ఠ మవుతాయి. అంతర్జాతీయ శక్తిగా భారతదేశం వెలుగు లీనాలంటే- చదువుల్లో సమూల సంస్కరణలకు శ్రీకారం చుట్టి, భావి తరాన్ని నిపుణ మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభు త్వాలు ముందడుగు వేయాల్సిందే!

# చెరువులను ఆక్రమించి పంట పొలాలుగా వినియోగించుకుంటున్నారు

- చెరువులకు నీళ్లు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు
- స్పందనలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన నాగయ్యపేట సర్పంచ్ కర్రీ పుష్ప



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : దేవరపల్లి మండలం నాగయ్య పేట పంచాయతీ లో తాలూకా సీతంపేట రెవెన్యూ లో 1) కస్తూరి బందా - సర్వే నెంబర్ -260 విస్తీర్ణం 3.98 సెంట్లు,2) శఖ మ్మ చెరువు - సర్వే నంబర్-264 విస్తీర్ణం 5.56 సెంట్లు, 3) ఖాతా ఉపేంద్ర రాజుచెరువు సర్వే నెంబర్ 257 విస్తీర్ణం 5.47 సెంట్లు,4) సీతమ్మ చెరువు సర్వే నంబర్115 విస్తీర్ణం6.26 సెంట్లు, చెరువులను ను కొంతమంది (రైవాడకు చెందిన కొందరు వ్యక్తులు) ఆక్రమించి, వ్యవసాయ పొలం గా మార్చి తమ సొంత భూమిగా వినియోగించుకుంటున్నారు. అయితే 50వేల ఎకరాలకు సుమారుగా నీరందించే చెరువులును ఆక్రమించిన వల్ల పంటలు పండక బీడు భూములుగా మారి, జిరాయితీ (అయ కిట్టు)రైతులునీరు లేక చాలా ఇబ్బంది పడుతున్నారు ,దీనిపై ఎవరు ఇంతవరకూ స్పందించకపోవడంతోసాగు చేసుకుంటున్నాడు. అయితే, దీనిపై ఆ వ్యక్తులకు ఎలాంటి అధికారం ఉంది. ఎవరు పట్టా ఇచ్చారు.వీరికి ఆ భూమి ఎలా సంక్రమించింది, వివరాలు ఇస్తూ తక్షణమే (సెటిల్మెంట్ అడంగల్) (ఎఫ్.ఎం.బి) (1Bరికార్డు పరిశీలించి,) దీనిపై ఆ వ్యక్తులకు అధికారం తొలగించి పూర్తిగా చెరువులు ను సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించి సర్వే రిపోర్ట్ ఇస్తూ, చెరువులు ను ఆక్రమించి వ్యక్తులు పై క్రిమినల్ చర్యలు తీసుకుంటూ, ఆయ కట్టు రైతులకు నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటూ మా పంచాయతీ (గ్రామ అభివృద్ధికి )తోడ్పడుతూ కోరుచున్నాము. అయితే సోమవారం నాగయ్య పేట సర్పంచ్ కర్రి పుష్ప జిల్లా కలెక్టర్ కి అలాగే కర్రీ నాయుడు ఎమ్మార్వో కి వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది . త్వరితగతిన పరిష్కారం చూపుతారని . కోరుచున్నామని గ్రామ పంచాయితీ సర్పంచ్ కర్రీ పుష్ప ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆర్ట్, క్రాఫ్ట్,పి.ఈ.టి లకు తక్షణ మే పనికి తగ్గ వేతనం కల్పించాలి



శ్రీకాకుళం విద్యావిభాగం (విజయభాను న్యూస్) : శ్రీకాకుళం జిల్లాలో గత పది సంవత్సరాలుగా సమగ్ర శిక్ష పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగస్తులైన ఆర్ట్ ,క్రాఫ్ట్, పి. ఈ. టి లకు పనికి తగ్గ వేతనం కల్పించవలసిందిగా సోమవారం శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ లో ఆ సంఘ అధ్యక్షుడు అయినా ఎల్.వి . రమణ వినతి పత్రాన్ని అందజేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు పార్ట్ టైం అనే పదాన్ని తొలగించి ఒకేషనల్ ఇన్స్ట్రక్టర్గా పేరు మార్చు చేయవలసిందిగా ఈ సందర్భంగా కోరారు, దీంతోపాటు ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం 14,203/ - రూపాయల గౌరవ వేతనం తమ కుటుంబ పోషణకు సరిపోవటం లేదని వాపోయారు, తక్షణమే తమకు టైం స్కేల్ వర్తింపు చేయవలసిందిగా, ముఖ్యమంత్రి వైయస్ .జగన్మోహన్ రెడ్డికి, విద్యాశాఖ మంత్రి అయినా ఆదిమూలపు సురేష్ కు, రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ అయినా వి. సేల్వి కీ హృదయపూర్వకంగా వేడుకున్నారు, ఈ కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు అయినా ఎల్. దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యాలయాల ఏర్పాటుకు భవనాలు, స్థలాలను గుర్తించండి

*కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో అధికారులను ఆదేశించిన జేసీ వేణుగోపాల్ రెడ్డి*

విశాఖపట్నం : పాడేరు, అనకాపల్లి జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని జాయింట్ కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా స్థాయి అధికారులతో సమావేశమైన ఆయన కొత్త జిల్లాల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని జేసీ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని విభాగాల హెచ్.వొ.డి.లు ప్రత్యేక దృష్టిసారించి అనకాపల్లి, పాడేరులలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ, ప్రయివేటు భవనాలను తాత్కాలిక అవసరాల నిమిత్తం గుర్తించాలని ఆదేశించారు. అదేవిధంగా శాశ్వత కార్యాలయాల నిర్మాణానికి ఆయా విభాగాల పరిధిలో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాల నివేదికను అందజేయాలని సూచించారు. రోడ్లు, భవనాల శాఖ అధికారులు ఇతర విభాగాల అధికారులతో సమన్వయం తో ప్రక్రియను సజావుగా త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. సేకరించిన పూర్తి వివరాలను 14వ తేదీ సాయంత్రం లోగా డీఆర్పీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్లు అరుణ్‌బాబు, కల్పనాకుమారి, డీఆర్వో శ్రీనివాస మూర్తి, ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమయం

### జీవితం

వర్తమానంలో జీవిస్తూ
భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటూ
ఆశావహ దృక్పథంతో సాగడం అవశ్యం
ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు
ప్రణాళికలు, కార్యాచరణ, పట్టుదల,
క్రమశిక్షణ, ముందుచూపు అత్యావశ్యకం
మనోభావాలలో చైతన్యం
ఆలోచనలలో నూతనత్వం
ప్రవర్తనలో దివ్యత్వం
సంబంధిత రీతిలో ఆదర్శవంతమైన
నూతన నిర్ణయాల రూపకల్పన
భిన్నత్వంలో ఏకత్వం
జాతీయ సమగ్రత, సర్వజీవ సమానత్వం
ఉల్లాస, ఆనందభరితమైన జీవితం
అందరి లక్ష్యం, గమ్యం, ఆశయం

...కవితా రచన
సి.ప్రతాప్


## పంచాంగం

మాసం : మాఘ; తిథి : చతుర్ధశి రా.9.15; పుష్యమి ప.1.37; తె.వ.3.17ల 5.00 — మంగళవారం 15-02-2022

a **మేషం** : విలువైన వస్తువుల కొనుగోళ్ళ నిమిత్తం ధనం బాగా ఖర్చు చేస్తారు. ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించి అగ్రిమెంట్లు వాయిదా వేసు కోవాల్సి వస్తుంది. వాహనం ఇతరులకు ఇచ్చే విషయంలో లౌక్యంగా వ్యవహరించండి. బంధువుల రాక కొంత అసౌకర్యం కలిగిస్తుంది. b **వృషభం** :కుటుంబ విషయాలపై దృష్టి సారిస్తారు. మీ యత్నాలు గుంభనంగా సాగించాలి. ఇంటా ఒయటా మీ మాట చెల్లుబాటు కాగలదు. కొబ్బరి, పండ్లు, పువ్వులు, చిరు వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. ఓర్పుతో సర్దుకు పోవ టానికి యత్నించండి. బంధువులు, సోదరుల మధ్య ఆత్మీయతలు నెలకొంటారు. c **మిధునం** : బ్యాంకు డిపాజిట్లు దీర్ఘకాలిక పెట్టుబడులు అనుకూలం. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. స్థిర చరాస్తుల విషయంలో ఒక నిర్ణయానికి వస్తారు. కిట్టని వారు మిమ్ములను తప్పు దారి పట్టించేందుకు యత్నిస్తారు. విద్యార్థినులకు ప్రేమ వ్యవహారాల్లో చుక్కెదు రవుతుంది. d **కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, వ్యవహార ఒప్పందాల్లో జాగ్రత్త అవసరం. పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. బంధువులతో తగాదాలు ఒత్తిడి తప్పవు. ఒక స్థిరాస్తి కొనుగోలుకు అడ్డంకులు తొలగిపోగలవు. వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండ టం శ్రేయస్కరం. e **సింహం** : తలపెట్టిన కార్యక్రమాలు ఆలస్యంగా సాగు తాయి. ఉద్యోగస్థులు సమర్థవంతంగా పనిచేసి అధికారులను మెప్పిస్తారు. విద్యార్థునలు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవ హారాలు మీరు కోరుకున్నట్లుగానే వాయిదా పడతాయి. నిరుద్యోగులు వచ్చిన అవకాశాన్ని తక్షణం వినియోగించుకోవాలి. f **కన్య** : పెద్దలుగా మీ బాధ్యతలు నిర్వహిస్తారు. సభలు, సమావేశాల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టు కుంటారు. ఎప్పటి నుంచి వాయిదా పడుతున్న పనులు పునఃప్రారంభ మవు తాయి. హామీలు, చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు వాయిదా వేయాల్సి వస్తుంది. g **తుల** : కళల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఇచ్చిపుచ్చుకొనే వ్యవహారాలు, రిజిస్ట్రేషన్లు అనుకూలిస్తాయి. ఉద్యోగస్తులకు బరువు బాధ్యతలు అధికం కావడంతో శ్రమాధిక్యత తప్పదు. ఆలయ సందర్శనాల్లో ఇబ్బందులు తప్పవు. ఏకాంతం కోసం చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు స్వీయ ఆర్జన పట్ల ఆసక్తి, తగు ప్రోత్సాహం లభిస్తుంది. h **వృశ్చికం** : ఆర్థిక విషయాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తారు. ఉపాధ్యాయులకు, మార్కెటింగ్ రంగాల వారికి ఒత్తిడి అధికమవుతుంది. కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు వాయిదా పడుతున్న పనులు పునః ప్రారంభం కాగ లవు. మీ సమర్థత, నిజాయితీలకు ప్రభుత్వము నుంచి మంచి గుర్తిపు, రాణింపు లభిస్తుంది. i **ధనుస్సు** : వ్యాపారాల్లో ఆటుపోట్లను ధైర్యం ఎదుర్కొని లాభాల బాటలో నడిపిస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తుల సహకారం లభిస్తుంది. విద్యార్థులకు వేడుకలకు వేడుకలలో హడావుడి, చురుకు తనం అధికమవుతాయి. వైద్యులకు శస్త్ర చికిత్సల సమయంలో ఓర్పు, ఏకాగ్రత చాలా ముఖ్యం. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుంది. j **మకరం** : దైవ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని అందరినీ ఆకట్టుకుంటారు. విద్యార్థులు బజారు తినుబండారాలు భుజించడం వల్ల అస్వస్థతకు లోనవు తారు. భార్యాభర్తల మధ్య అవగాహనాలోపం వల్ల సమస్యలు తలెత్తుతాయి. మీ కళత్ర మొండి వైఖరి మీకు ఎంతో ఆందోళన కలిగిస్తుంది. k **కుంభం** : కొబ్బరి, పండ్లు, పూల వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. శత్రువుల సైతం ఆకట్టుకుని ముందుకు సాగుతారు. దూర ప్రయాణాల్లో వస్తువుల పట్ల మెళకువ అవసరం. రావలసిన బకాయిలు సకాలంలో అందిన ధనం ఏమాత్రం నిల్వ చేయలేరు. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. k **మీనం** :దైవ పుణ్య కార్య క్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిని ఇస్తాయి. రుణాలు తీర్చడానికి చేయు యత్నాలు వాయిదా పడతాయి.

# విశ్వసిస్తేనే భగవద్దర్శనం

## సంకీర్తన



భగవంతుడు సాధు రక్షణార్థం, ధర్మ సంస్థాపనార్థం ఏ రూపంలోనైనా గోచరించగలడు. అదే భగవంతుని అవతార విశిష్టత. ఆయనను సంపూర్ణంగా విశ్వసించక పోతే బాధపడక తప్పదు. విశ్వసిస్తే ఆత్మగత సంబంధం ఏర్పడుతుంది. దేవుడి శక్తి మనలో నిండి ఉంటుంది. కనుక అప్పుడు ఎవరిలోనైనా దైవత్వం కనపడుతుంది. ఇలాంటి భావం అందరిలో ఏర్పడకపోవడానికి కారణం, దేవుడు లేడని కాదు మనకు దేవుడు కనపడాలన్న కోరిక బలంగా లేకపోవడం. కోరికలు మహారాజును కూడా కటిక పేదవాడిగా మార్చగలవు.

కనుక భక్తులు కోరికలకు దూరంగా భగవంతుడికి దగ్గరగా ఉండేం దుకు ప్రయత్నించాలి. మనకు అవసరమైనవన్నీ భగవంతుడే అడక్కుండా సమ కూరుస్తాడు. మనం కోరుకున్న కోరికలలో ఏవైనా తీర లేదంటే అవి మనకు మేలు చేయనివని దేవునికి అనిపించి ఉండాలి.

అందుకే పరమాత్మ మనకు అనుగ్రహించలేదని తెలుసుకోవాలి. ఈనాడు భగవంతుని గురించి వినడానికి ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు. అయినా వారిలోని అశాంతిని పారదోలు కోలేకుండా వున్నారు. ఎన్నో ఉపదేశాలు వింటున్నారు. ఎన్నో సేవాకార్యక్రమాలు వ్యక్తిగతంగా, సామాజిక పరంగా చేస్తున్నారు. అయినా వారిలో శాంతి లేదు.

వినడమొక్కటే సరిపోదు. భక్తితో భగవంతుడిని సేవించినప్పుడే బ్రతుకు పునీతమవుతుంది. మనః పూర్వకంగా భగవంతుణ్ణి ధ్యానించే వారికి అసంతృప్తి అనేది వుండదు. తన గురించి మనకెంత తెలుసునని ఆయన ఆలోచించడు, ఆయన కోసం మనమెంత తపిస్తున్నామనేదే ఆయన వీక్షణ. దేవుడు మన భక్తి విషయంలో సదా మేల్కొనేట్టుగా మన పూజలు వుండాలి. అంతేగానీ ఉన్నాడో లేడోనని పది మందిని పోగేసి మీమాంసలు చేయవద్దు. సంశయాత్ము లకు భగవంతుడు సందేహా స్పదుడే! దైవ కార్యా లకు వచ్చే విఘ్నాలను దైవమే పోగొట్టాలి. తన శక్తి పైన గాక పరమాత్మ శక్తి పైన ఆధారపడి జీవించే వాడు భక్తుడు. మూడవ నేత్రం ముక్కంటికే గాదు, మనుష్యులందరికీ ఉంది. అదే జ్ఞాన నేత్రం. ఎవరికి జ్ఞాననేత్రం తెరుచు కుంటుందో వారు గర్వాన్ని దగ్ధం చెయ్యగలరు.

సర్వం జ్ఞాన ప్లవే నైవ వృజినం సంతరిష్యసి జ్ఞానమనే తెప్పచే పాపరాశిని దాటగలవని శ్రీకృష్ణుడు గీతలో బోధించాడు. భగవంతుని యందు సంపూర్ణ విశ్వాసం వుంచిన వాడికి జగమంతా వెలుగులే!



# రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలుగా

## గెడ్డం ఉమ ప్రమాణ స్వీకారం



పరవాడ (విజయభాను న్యూస్) : విశాఖపట్నం కి చెందిన మహిళా నాయకురాలు గెడ్డం ఉమను ఇటీవలే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నేడు మంగళగిరిలో మహిళా కమీషన్ ఛైర్పర్సన్ వాసీరెడ్డి పద్మ రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలుగా గెడ్డం ఉమ చేత ప్రమాణస్వీకారం చేయించారు. అతి పిన్న వయసులో ఇంత పెద్ద బాధ్యతను స్వీకరించిన మహిళగా ఉమ చరిత్రలో నిలిచిపోతుంది అని మహిళా కమిషన్ ఛైర్పర్సన్ వాసీరెడ్డి పద్మ గెడ్డం ఉమ ను అభినందించారు. ఈ సందర్భంగా గెడ్డం ఉమ మాట్లాడుతూ...

ఒక సాధారణ బీసీ యువతిని అయిన నన్ను ఇలాంటి స్థానంలో నిలబెట్టి యువతకి అవకాశాలు ఇస్తు అందులోన మహిళలను ప్రోత్సహిస్తూ బీసీ ల వెన్నుతడుతున్న అభినవ జ్యోతిరావు పూలే జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. జగన్ మోహన్ రెడ్డి గారు అప్పగించిన ఈ బాధ్యతను శక్తివంచన లేకుండా పని చేస్తూ పార్టీలకి అతీతంగా మహిళల మాన ప్రాణాల రక్షణ కోసం పని చేస్తానని తెలియజేశారు. ఒక మహిళా అన్యాయా నికి గురైన తరువాత మహిళా కమీషన్ అండగా నిలవడం ఇప్పటి వరకు చూశాం కానీ ఇక నుండి అన్యాయాలు జరగకుండా ఉండేందుకు అవసరమైన ముందస్తు జాగర్త చర్యలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తూ అన్ని విధాలుగా మహిళలకు తోడు ఉండి మహిళా జాతి అభ్యున్నతికి అందరం కలిసి కృషి చేయాలని దానికి అధికారులకు అందరూ కూడా సహకరించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కమీషన్ సభ్యులు జయశ్రీ, గజ్జల లక్ష్మి, నూతన సభ్యులు రొఖయ బేగం, బోసి వినీత, డైరెక్టర్ సుజియా, కార్యదర్శి శైలజ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సహాయం చెయ్యడం ఎంతో సంతృప్తినిస్తుంది

## వీఎంఆర్డీఏ చైర్ పర్సన్ అక్కరమాని విజయ నిర్మల వెంకటరావు దంపతులు



అక్కయ్యపాలెం, (విజయభాను న్యూస్) : పేదలకు సహాయం చెయ్యడం ఎంతో సంతృప్తినిస్తుందని వీఎంఆర్డీఏ చైర్ పర్సన్ అక్కరమాని విజయ నిర్మల వెంకటరావు దంపతులు అన్నారు. సోమవారం విశాఖ తూర్పు నియోజకవర్గం పరిధి అరిలోవ ప్రాంతానికి చెందిన పీ.లక్ష్మి అనే నిరుపేద యువతి వివాహం నిమిత్తం తాళిబొట్టు,నూతన పట్టు వస్త్రాలు, ఐదువేల నగదును తమ కార్యాలయంలో అందచేశారు.

ఈ సందర్భంగా అక్కరమాని దంపతులు మాట్లాడుతూ నియోజక వర్గ ప్రజలకు అన్నివిధాలా అందుబాటులో ఉండి అన్నివిధాలా అండగా ఉంటామన్నారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్ఫూర్తితో ప్రజలకు సహాయసహకారాలు అందిస్తూ విశాఖ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు.తన వివాహా నికి సహాయం చేసిన అక్కరమాని దంపతులకు వధువు లక్షి,ఆమె కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డు అప్పలనాయుడు కూడా పాల్గొన్నారు.

# 50 అడుగులతో నిర్మించనున్న శ్రీశ్రీశ్రీ ఆంజనేయస్వామి విగ్రహానికి భూమి పూజ నిర్వహించిన పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి





పాడేరు (విజయభాను) : జి.మాడుగుల మండల కేంద్రంలో గాంధీనగర్ కోల్ని నందు 50 అడుగులతో నిర్మించానున్న శ్రీ శ్రీ ఆంజనేయస్వామి విగ్రహానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి భూమిపూజ చేసిన గౌరవ పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో ఉన్న 11 మండలాలకు దరిదపుగా 450 కి పైగా విగ్రహాలు అందించిన విగ్రహ దాత శ్రీ సద్గురు సాయి రామ్ భీమిలి ఆశ్రమం వారికీ ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు అలాగే స్థల దాత పాంగి రూప కి రేగం అప్పలరాజు గారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మె ల్యేతో పాడేరు మార్కెట్ యార్డ్ ఛైర్పర్శన్ మత్యారాస గాయిత్రి గారు వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ గారు జి.మాడుగుల సర్పంచ్ కిముడు రాం బాబు సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు సురబంగి రామకృష్ణ లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసి దొర గారు జి.మాడుగుల ఎంపీటీసీ విజయ్ కుమారి గారు సింగర్భ ఎంపీటీసీ పాంగి చిట్టిబాబు గారు గ్రామస్తులు వివిధ గ్రామాలనుండి విచ్చేసిన భక్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మహిళా మండల ప్రధాన కార్యదర్శిగా పెట్టేలి పద్మ



అరకులోయ (విజయభాను న్యూస్ ) గ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి క్షేత్రస్థాయిలో తీవ్రంగా పార్టీ శ్రేణులు కృషి చెయ్యాలన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పాచిపెంట శాంతకుమార సోమవారం. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ పార్టీ విస్తరణ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికై, కాంగ్రెస్ పార్టీలో నూతన చేరికలు, నూతన నియామకాలు చేస్తున్న సందర్భంగా సోమవారం ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరకు పార్లమెంట్ డిస్ట్రిక్ట్ ఇంచార్జ్ పాచిపెంట శాంతకుమారి.ఆధ్వర్యంలో

మండలం, లోని పద్మాపురం గ్రామ పంచాయతీకి చెందిన పెట్టెలి పద్మనూ అరకు వేలి కాంగ్రెస్ పార్టీ మహిళా మండల ప్రధాన కార్యదర్శిగా, నియామకం చేయడం జరిగిందనారు ఈ సందర్భంగా పాచిపెంట శాంత కుమారి మాట్లాడుతూ.! పెట్టేలి పద్మ, గతంలో కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలను గుర్తించి తనపై నమ్మకంతో ఈ బాధ్యతను తనకు ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. మండల పరిధిలో కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం కోసం తీవ్రంగా కృషిచేసి మండలం నుండి పంచాయతీ గ్రామాల స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గిరిజన ప్రజల సమస్యలను పరి ష్కారం చేసే దిశగా రాబోయే రోజుల్లో పాటుపడతారని పని చేస్తారని ఆకాంక్షిస్తునట్లు ఆమె స్పష్టం చేశారు.

# పోలీసులకు సహారా గ్రూప్ సిబ్బంది వినతులు



అరకులోయ (విజయభానున్యూస్) సెబి నిర్ణయంపై జీవితాలు ఆధారపడి ఉన్నాయని ఆవేదన:- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సెబీ సహారా రిఫండ్ ఖాతాలో సహారా గ్రూపు జమ చేసిన 24 వేల కోట్ల రూపాయలను ఇప్పటివరకు సెబీ విడుదల చేయడం లేదని ఫలితంగా డిపాజిట్ దారులకు తిరిగి చెల్లింపు చేయలేని పరిస్థితిలో ఉన్నామని ఇప్పటికైనా ఆ నిధులు విడుదల చేయాలని సహారా గ్రూప్ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు తాము తమ దగ్గర ఉన్న వాళ్ల పేర్లు వివరాలు ఇస్తామని మీరే స్వయంగా చెల్లించిన పర్వాలేదని వారన్నారు. ఈ విషయంపై అనేకసార్లు సేవ కోరుకుంటున్నా సెబీకి విన్నవించుకున్నా స్పందన లేదని ధర్నా చేసిన ఫలితం లేదని వారు వాపోయారు. అందుకే సహారా గ్రూప్ అరకు వ్యాలీ బ్రాంచ్ మేనేజర్ వి వి రమణ మూర్తి ఆధ్వర్యంలో తమ క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి అరకు వ్యాలీ ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ గారికి, అలాగే అరకు వ్యాలీ సి ఐ జి.దేవుడు బాబు గారికి మరియు అరకు వ్యాలీ ఎస్ఐ టీ. మల్లేశ్వర రావు గారికి వినతిపత్రం ఇచ్చామని సహారా గ్రూపు ఆస్తుల వివరాలు కార్యాలయాల ఎదుట ధర్నా చేసిన చిత్రాలతోపాటు ఈ కేసులో సుప్రీం కోర్టు తీర్పు తర్వాత జరిగిన పరిణామాలను వినతిపత్రంలో పొందుపరిచినట్లు సహారా గ్రూపు అరకు వ్యాలీ బ్రాంచ్ మేనేజర్ వి వి రమణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికైనా మా కష్టమర్ల బాధలను సెబి అర్థం చేసుకొని వెంటనే మా డిపాజిట్ విడుదల చేయాలని ఈ సందర్భంగా కోరుకుంటున్నామని వారన్నారు. ఇప్పటికే మా కష్టమర్లతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని మా పరిస్థితులను అర్థం చేసుకుని తక్షణ సహాయం చేయగలరని క్షేత్రస్థాయి సిబ్బంది ఆవేదన వెలిబుచ్చారు. మా కష్టమర్లకు సమాధానం చెప్పలేక నానా ఇబ్బందులకు గురవుతున్నామని తక్షణమే అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయి సిబ్బంది జీ. ప్రసాద్ రావు, ఏ.ఆనందరావు, ఎస్. చిన్నారావు, ఎస్ .సిబో, ఏం. సావిత్రమ్మ, బి.వైకుంఠరావు, వి .సంధ్య, పి.సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షుడుగా మైలపల్లి లక్ష్మణరావు



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : భీమిలి గ్రామ దేవత. శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ ఉత్సవ కమిటీ 2022- 2023 ఎన్నిక నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గా మైలపల్లి లక్ష్మణరావు, కార్యదర్శి గా కనకల. అప్పల నాయుడు, కోశాధికారి గా పాసి మధు సూదనరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గా వాసుపల్లి ఎల్లాజీ రావు కో ఆర్డనేటర్ గావాడ మొదల సత్యా రావులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మైల పల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ అమ్మ వారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఉత్సవాలు మార్చి 30 నుండి ఏప్రిల్ 2 వరకు జరుగు తాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆలయ పూజారులు చౌదరీ సత్యరాజు, నూకా వెంకటేష్, మారుతి, ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు గాడు అప్పల నాయుడు, సభ్యులు మైలపల్లి షణ్ముఖ రావు, గంటా నూకరాజు, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ వాసుపల్లి కొండబాబు, అమ్మవారి భక్తులు కె.ముత్యాల రావు, వాసుపల్లి. ఎల్లాజీ రావు (రంగ), ఎచ్చర్ల. హరి, అల్లిపిల్లి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన - టీడీపీ నుండి

## వైస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఎమ్మెల్యే వాసుపల్లి సమక్షంలో భారీ చేరికలు



అక్కయ్యపాలెం (విజయభాను న్యూస్) : విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలో 33వార్డ్ వెంకటేశ్వర మెట్ట ఏరియా లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం దగ్గరలో లివైస్సార్సీపీ నాయకులు వేగి వెంకట అప్పారావు మరియు బొర్రా శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని 33వార్డ్ నుండి జనసేన& టీడీపీ కార్యకర్తలు సుమారుగా 200మందికి పైగా వైస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి లివిశాఖ దక్షిణ నియోజకవర్గ శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్లి సమక్షంలో ( స్వామి టీం & సుధీర్ టీం ) భారీ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా వేగి వెంకట అప్పారావు మాట్లాడుతూ లిగౌరవ సీఎం శ్రీ వైఎస్ జగన్మోహన్ రెడ్డిలి మాట తప్పని-మడం తప్పని " గొప్ప మహానేత అని, నిరుపేదల కొరకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, సుపరిపాలన నచ్చి ఆ పార్టీలో గత నెల చేరటమే కాకుండా ఈ రోజు తన సమక్షంలో 200మందిని వైస్సార్సీపీ లో చేర్పించడం ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేగి వెంకట అప్పారావు ఏ పార్టీ లో ఉంటే ఆ పార్టీ గెలిచి అధికారంలో ఉంటున్నదని హర్షం వ్యక్తం చేశారు. నిరుపేదల పట్ల చూపిన అభిమానము & ప్రేమ, సోషల్ వర్క్ ద్వారా అనేకమంది కి సహాయ సహకారాలు అందిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు వైస్సార్సీపీ నాయకులు శ్రీ వేగి వెంకట అప్పారావు దంపతులు, బొర్రా శ్రీనివాస్ రెడ్డి, విజయలక్ష్మి, కొల్లి సత్యవతి, వలిశెట్టి లక్ష్మి, ఎస్.సి సెల్ ప్రెసిడెంట్ బోణి దేవా, బాబుల్ శ్రీను, హేమ, వెంకటేశ్వర రెడ్డి, గంగమ్మ , వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు మరియు జనసేన & టీడీపీ నుండి నూతనంగా చేరిన పార్టీశ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

### ఈ నెల 26, 27 తేదీలలో హిందీ పరీక్షలు

భీమునిపట్నం : దక్షిణ భారత హిందీ ప్రచార సభ చెన్నై వారి ఆధ్వర్యంలో జరుగు పరీక్షలు పరిచయ్, ప్రాథమిక, మాద్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక, రాష్ట్ర భాషా విశారద పూర్వార్థ, రాష్ట్ర భాషా విశారద ఉత్తరార్థ, రాష్ట్ర భాషా ప్రవీణ పూర్వార్థ మరియు రాష్ట్ర భాషా ప్రావీణ ఉత్తరార్థ పరీక్షలు ఫిబ్రవరి నెల 26, 27 తేదీలలో జరుగునని ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి అద్యక్షులు కాళ్ళ సూర్య రామ కృష్ణారావు తెలియజేసారు. ఈ ఆదర్శ్ హిందీ ప్రేమి మండలి ద్వారా ఉచిత శిక్షణ పొందిన వారికి వారి హాల్ టిక్కెట్లు ఈనెల 20వ తేదీనుండి ఇవ్వబడునని కృష్ణారావు తెలిపారు.

# గ్రామాలు అభివృద్ధి వైసీపీతోనే సాధ్యం

## జల జీవన్ పనులు ప్రారంభోత్సవంలో సర్పంచ్ కల్పన రాజశేఖర్



పరవాడ(విజయభాను న్యూస్) : పరవాడ మండలం పి బోనంగి పంచాయితీలో జల జీవన్ (ఇంటింటికి కుళాయిలు ) పనులు సోమవారం బండారు కల్పన రాజశేఖర చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరము సర్పంచ్ బండారు కల్పనా రాజశేఖర్ మాట్లడుతూ గ్రామాభివృద్ధీ వైసిపితోనే సాధ్యపడుతుంది అని కొనియాడారు. సర్పంచ్ గా నామినేషన్ వేసిన వెంటనే పి బోనంగి నవరత్నాలు ప్రకటించడం జరిగింది అన్నారు. ఇందులో గెలిచిన రెండున్నర సంవత్సరాల లోపు ప్రతి ఇంటికి కూడా కుళాయి ఇస్తానన్న వాగ్దానానికి ఎంతగానో ఈ పథకం ఉపయోగ పడు తుందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ళ నుండి నీళ్ల కోసం ఎదురుచూస్తున్న పి బోనంగి ప్రజల దాహార్తిని తీర్చారు. ఈ క్రమంలో జల జీవన్ పథకం ఎంతగానో ఉపయోగ పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొంతిన రాము, కప్పరాడ శ్రీనివాసరావు! వార్డ్ నెంబర్ లక్ష్మి, ప్రసాద్ మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి లేక కాలయాపన చేస్తున్న వైసీపీ ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు - నేడు కలిగొట్ల వంతెన అసంతృప్తి నిర్మాణం పై నిరసన కార్యక్రమం





దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తోందని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఆరోపించారు. మండలంలోని కలిగొట్ల, వేచలం మధ్య నిర్మించిన అసంతృప్తి వంతెనను సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు నేటికీ బిల్లులు మంజూరు చేయక సంబంధిత కాంట్రాక్టర్లు అప్పులపాలై దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు. 2013లో తను శాసనసభ్యులుగా ఉన్నప్పుడు కలిగొట్ల - వేచలం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయన్నారు. అప్పటికే దాదాపు 80శాతం పనులు పూర్తయినప్పటికీ మిగిలిన అప్రోచ్ రోడ్డు నిర్మించడంలో స్థానిక శాసనసభ్యులు అలసత్వం వహించడం సిగ్గుచేటన్నారు. భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాల్సి ఉండగా నేటికీ ఒక్కపైసా కూడా ఈ ప్రభుత్వం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే వంతెన నిర్మాణం పనులు పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజలకు న్యాయం చేకూర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉదయం నుంచి గురువారం వరకు ఇరవై ఆరు గంటల పాటు నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఈ నిరసన కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీడికాడ మండల పార్టీ అధ్యక్షులు పోతుల చిన్నం నాయుడు, దేవరాపల్లి మండల పార్టీ అధ్యక్షుడు చిటీమిరెడ్డి సూర్య నారాయణ, కే కోటపాడు మండల పార్టీ అధ్యక్షులు పూడి నారాయణమూర్తి, అనకాపల్లి పార్లమెంటు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కిల్లి బాలాజీ, బండారు శ్రీరామ్మూర్తి వేచలపు శ్రీను,వేపాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సంఘ సేవకులు కీ.శే ఉమ్మిడి లక్ష్మయ్యకు ఘన నివాళులు



గాజువాక : (విజయభాను న్యూస్): నియోజక వర్గం గంగవరం గ్రామంలో గత నెల 25వ తేదీన అనారోగ్యంతో మరణించిన ప్రజా నాయకులు కీ.శే ఉమ్మిడి లక్ష్మయ్య పెద్ద కర్మ సందర్భంగా సోమవారం ఆయన నివాసం వద్ద ఆయన చిత్రపటానికి గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, బీజేపి గాజువాక నియోజకవర్గ కోఆర్డినేటర్ కరణంరెడ్డి నరసింగరావు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్బంగ వారు మాట్లాడుతూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని కోరుకుంటు న్నామని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ పరుస్తున్నామని అన్నారు. వారి కుటుంబ సభ్యులు భార్య సత్తయ్యమ్మ, కుమారులు దేముల్లు, కుమారుడు బీజేపి గంగ వరం మండల ప్రదాన కార్యదర్శి సోము లను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ పిల్మ్ బోర్డు మెంబరు పైడిరాజు మాజీ బీజేపి కౌన్సిలర్ పేర్ల సత్యారావు మండల అధ్యక్షులు పేర్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ విద్యా విధానం సాకుతో


# ప్రాథమిక పాఠశాలలకు టెండర్ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

భీమునిపట్నం (విజయభాను న్యూస్) (విజయభాను న్యూస్) పది సమస్యలను సృష్టించి రెండు సమస్యలకు పరిష్కారం చూపి జనాల కళ్ళను సమస్యలవైపు చూడకుండా దారి మళ్లించడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మించిన వారెవరూ ఉండరని టి డి పి రాష్ట్ర కార్యదర్శి, భీమిలి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గంటా నూకరాజు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం సాకు చూపించి ముఖ్యమంత్రి ఆడుతున్న విద్య క్రీడల్లో పిల్లలు, తల్లిదండ్రులు బలిపశువులు అవుతున్నారని అన్నారు. ప్రాథమిక పాఠశాలలను ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేసి ఉపాధ్యాయుల కొరతను సృష్టిస్తున్నారని అన్నారు. మూడు సంవత్సరాలు నుండి డిఎస్సీ నోటిఫికేషన్ లేదని ఈ కాలంలో ఎంతోమంది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేశారని అన్నారు. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉంటే ఆ సబ్జెక్టు చెప్పే ఉపాధ్యాయులు లేకపోతే విద్యార్థులు పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవుతారని అడిగారు. జాతీయ విద్యావిధానం అమలు చేసేటప్పుడు విద్యార్థుల మనోభావాలను అర్థం చేసు కోరా గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న పిల్ల లను హైస్కూల్ లో విలీనం చేయడం వలన 3 లేక 4 కిలోమీటర్లు ప్రయాణం చేయవలసి వస్తుందని అన్నారు. మీరిచ్చే అమ్మఒడి డబ్బులు పేద పిల్లల ఆటో ఖర్చులకు సరిపోతాయని అన్నారు. పిల్లలకు కావలసినది నాణ్యమైన, ఉన్నతమైన విద్య అని దానిని తుంగలో తొక్కి విద్యార్థులను, తల్లిదండ్రులను అయోమయానికి గురిచేస్తున్నారని గంటా నూకరాజు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయక, ప్రాథమిక పాఠశాలలను విద్యార్థులకు అందుబాటులో ఉంచక ఏమి చేద్దామను కుంటున్నారో ఈ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని గంటా నూకరాజు డిమాండ్ చేశారు.

# జిల్లా కార్యాలయాలు ఏర్పాట్లు కు భవనాలు గుర్తించండి

ఐటిడిఏ పి.ఓ.రోణంకి గోపాల క్రిష్ణ ఆదేశం



పాడేరు (విజయభాను) : పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామ రాజు జిల్లా ఏర్పాటు చేయడానికి అవసరమైన ట్రాన్సిట్ అకామిడేషన్ ఏర్పాటు చేయడానికి అవసరమైన భవనాలను గుర్తించాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాల క్రిష్ణ ఆదేశించారు. సోమవారం ఏజెన్సీ డివిజన్ స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందుబాటులో ఉన్న భవనాలు గుర్తించి నిర్దిష్టమైన ప్రొఫార్మాలో నివేదికలు వెంటనే సమర్పించాలని సూచించారు. భవనాలు గుర్తింపులో రెవెన్యూశాఖ, రహదారులు భవనాలు శాఖ అధికారులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. వచ్చే ఉగాది నుంచి జిల్లా పరిపాలన పాడేరు నుంచి పరిపాలన జరుగుతుందని అన్నారు. పాత అందుబాటులో ఉన్న భవనాలు మరమ్మతులు, అవసరమైన ఫర్నిచర్ తదితర వాటికి కావలసిన నిధులుపై నివేదించాలన్నారు. ఈకార్యక్రమంలో సబ్ కలెక్టర్ వి.అభిషేక్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.



కర్ణాటక గవర్నర్ తవర్ చంద్ గెహ్లాట్ ని సోమవారం బెంగుళూరులో మర్యాదపూర్వకంగా కలిసిన టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



వార్డ్ పరిధిలో ఉన్న జెకె అపార్ట్మెంట్ లో 80 సొంత ఇంట్ ఓనర్స్ అసోసియేషన్ మీటింగ్ కు ముఖ్య అతిధిగా 29వ వార్డ్ కార్పొరేటర్ ఉరికిటి నారాయణ రావు వెళ్లారు. మీటింగ్ లో పలు సమస్యలు మీద మాట్లాడారు.డ్రైనేజీ సమస్యలు,వాటర్ సమస్య, తెలపడం జరిగింది..వెంటనే సంబంధించిన అధికారులు తో మాట్లాడి వాళ్ళ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.అలాగే వల్ల అందరికి యూజర్ చార్జెస్ మీద తగిన అవగాహన ఇవ్వడం జరిగింది.

# శ్రమదానంతో స్మశానవాటిక శుభ్రం

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : స్థానిక బీచ్ రోడ్ గల హిందూ స్మశాన వాటికలో జాయింట్ యాక్షన్ కమిటీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. స్మశాన వాటిక పిచ్చి మొక్కలతో, ముళ్ల తుప్పలతో దయనీయ స్థితిలో ఉండడంతో ఇక్కడ దహన సంస్కార కార్య క్రమాలు చేసేవారు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఈ విషయం పై అధికారులను కలసి ఇదివరలో వినతిపత్రాలు ఇవ్వడం జరిగినప్పటికీ పరిస్థితిలో పెద్ద మార్పేమీ లేదు. దీనితో జాయింట్ యాక్షన్ కమిటీ ఫ్రెండ్స్ తమ సొంత నిధులు తో స్మశాన వాటికను శుభ్ర పరిచారు.ఈ కార్యక్రమంలో సన్నీ కాళ్ళ, కదిరి జగన్నాథం, చెల్లూరి. గౌరి నాయుడు, అడిదం.అంజనీ కుమార్ లు పాల్గొన్నారు.

# ఎ.పి.బి.సి కమిషన్ సభ్యులు పక్కి దివాకర్ కి మాతృ వియోగం




విశాఖ సిటీ (విజయ భాను న్యూస్) : గత కొద్ది రోజులు గా అనారోగ్యంతో బాధపడుతున్న పక్కి దివాకర్ తల్లి లక్ష్మీ భాయి (83) సోమవారం తుడిశ్వాస విడిశారు. పక్కి లక్ష్మీ భాయి భర్త కీ.శే. ప్రకాష్ రావు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు శాఖ సూపరెండెంట్ గా పనిచేశారు. ఈమె తండ్రి బలివాడ కాంతా రావు శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గా పనిచేశారు. మంగళవారం ఉదయం 8 గంటల కు మర్రిపాలెం రాము నాయుడు వీది వారి ఇంటి నుండి అంత్యక్రియలు కు తీసుకొని వెళతారు.

# క్రీడలలో రాణిస్తే ఉన్నత స్థాయికి...



అచ్యుతాపురం ( విజయభాను న్యూస్ ) : క్రీడలలో రాణిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సర్పంచ్ కూండ్రపు విమాల నాయుడు అన్నారు . సోమవారం అచ్చుతాపురం అల్లూరి కబడ్డి అకాడమీకి సర్పంచ్ 50 అప్పర్లు , కిట్లు కోచ్ అడిగర్ల సూర్యకి క్రీడాకారులు అందజేశారు . క్రీడాకారులకి వ్యాయమం చేసుకోవడానికి రన్నింగ్ ట్రాక్, పూలప్స్ బార్, ఎక్సర్సిస్ బార్ ఏర్పాటు చేశారు.

# సింహగిరి సీతారామాలయం లో వైభవంగా సంక్షిప్త రామాయణ హవనం







సింహాచలం (విజయభాను న్యూస్) : శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి దేవస్థానం లో ఉపదేవాలయం అయి నటువంటి గంగధార వద్దగల సీతారామ స్వామి వారి దేవాలయంలో లోక కళ్యాణార్థం పునర్వసు నక్షత్రం సందర్భంగా సంక్షిప్త రామాయణ హవనం అత్యంత వైభవో పేతంగా వైదిక స్వాములు నిర్వహించగా అధికారులు అర్చకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఈనెల 18 ,19 తేదీల్లో ఎన్ ఆర్ ఐ హిస్పటల్‌లో లైవ్ సర్జికల్ వర్క్ షాప్

భీమునిపట్నం : ప్రతినిధి సంగివలస లో ఉన్న అనిల్ నీరు కొండ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ లో పదవ అంతర్జాతీయ నీరు మరియు దవడ శస్త్ర చికిత్స విభాగం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యక్తి యొక్క సమగ్ర నోటి ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం కోసం సెంటర్ ఫర్ ఫేషియల్ ఎస్తేటిక్స్ ప్రొఫెషనల్ మరియు క్లినిక్ ఎక్స్ లెన్సు పెంపొందించడం కోసం, ఓ ఎం ఎఫ్ ఎస్ స్పెషాలిటీ క్యాంపస్ సమాజంలో శిశు జనాభాలో వివిధ పుట్టుక తో మరియు పొందిన ముఖ వైకల్యాలను గుర్తించడానికి నోటి క్యాన్సర్ టొబాకో నిలిపివేత గురించి అవగాహన కార్యక్రమం ను వైద్యులు నిర్వహించారు.

# ఘనంగా కోరుబిల్లి ప్రసాద్ & శీలపు లక్ష్మణ్ జన్మదిన వేడుకలు

ముఖ్య అతిథిగా హాజరైన 35వవార్డు వైయస్ఆర్‌సీపీ కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు




అక్కయ్యపాలెం (విజయభాను న్యూస్) : మా సోదరులు కోరు బిల్లి ప్రసాద్ అండ్ శీలపు లక్ష్మన్ జన్మదిన వేడుకలు హెూల్సేల్ మార్కెట్ జ్ఞానాపురం కూర గాయలు మార్కెట్ యార్డ్ లో అంగరంగ వైభ వంగా అంబరాన్ని అంటేలా సంబరాలతో జన్మదిన వేడు కలు అత్యంత వైభవంగా జరిగిన ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా 35 వ కార్పొ రేటర్ వైఎస్ఆర్సిపి కార్పొరేటర్ విల్లూరి భాస్కర రావు సమ క్షంలో కేక్ కట్ చేశారు.

అనంతరం

పేదలకు స్వీట్లు 2022 సం కేలండర్ పంపిణీ అయన చేతుల మీదుగా చేసారు మిఠాయిలు పంపిణీ చేసి క్యాలెండర్లు పంపిణీ చేయడం జరిగింది.

# సిహెచ్‌సి సెంటర్ ను సందర్శించిన

## ఏపివివిపి ఆస్పత్రుల జిల్లా సమన్వయకర్త డాక్టర్ వి.లక్ష్మణరావు



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : స్థానిక సిహెచ్‌సి సెంటర్ ను ఏపీవీవీపి ఆస్పత్రుల జిల్లా సమన్వయ కర్త డాక్టర్ వి.లక్ష్మణరావు సోమ వారం సందర్శించారు. అందులో భాగంగా నూతనంగా నిర్మించిన హాస్పటల్ భవంతినీ పరిశీ లించి రోగులకు అందించ వలసిన సేవలపై ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ దిద్దే సిద్దార్థ కుమార్ తో చర్చించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించమని వైద్యులకు తగు సూచనలు చేశారు. ఆసుపత్రి లో రోగులకు మంచి వైద్య సేవలుఅందించడమే కాకుండా వారితో స్నేహభావంతో మెలగాలని చెప్పారు.

# జగనన్న కాలనీల్లో

# మౌలిక వసతి సౌకర్యాల కల్పన



గొలుగొండ (విజయభాను న్యూస్) : గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామంలో జగనన్న కాలనీలో మంచినీటి బోరుకు సోమవారం గొలుగొండ జెడ్పిటిసి సుర్ల గిరిబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గల జగనన్న కాలనీల్లో ప్రభుత్వం మౌలిక వసతి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నవరత్నాల పథకం కింద గఅహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు రాయితీపై ప్రభుత్వ గఅహ నిర్మాణ సామాగ్రిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో 1611 లబ్ధిదారులకు గాను 45 లేఅవుట్లు కేటాయించి పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి సత్య నారాయణ, సర్పంచ్ చిన్నబ్బాయి, ఎంపిటిసి లెక్కల అప్పలనాయుడు పాల్గొన్నారు.

# పోదాం పదండి పూడిమడక

## మాఘ పౌర్ణమి జాతర, పుణ్యస్నానాలకు నేడు జాతర - రేపు పుణ్యస్నానాలు



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : హిందూ సాంప్రదాయం ప్రకారం కార్తీకమాసంలో దీపానికి ఎంత ప్రాముఖ్యత ఉందో , మాఘమాసంలో స్నానానికి అంత ప్రాముఖ్యత ఉందని పెద్దలు చెప్పారు. మాఘ పౌర్ణమి జాతర , పుణ్యస్నానాలకు పెద్ద ఎత్తున పూడిమడక వస్తారు. దీనికి పూడిమడక సముద్రతీరం ముస్తాభయ్యింది. నేడు రాత్రి జాతర , రేపు పుణ్యస్నానాలు చేసేందుకు వీలుగా తీరంలో ఏర్పాట్లు చేశారు . స్నానాలు చేయాడానికి జిల్లా నలుమూలల నుంచి వస్తారు . సముద్రంలో స్నానం చేసి జగన్నాధస్వామిని దర్శించుకుంటారు . సముద్ర స్నానాలుకు వచ్చేవారి కోసం ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు , మహిళలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు . స్నానాలకు వచ్చే భక్తులు సహకరించాలని నిర్వహకులు కోరారు . ఈ సందర్బంగా సోమవారం ఏఎస్ పి మణికంఠ చందోలు పూడిమడక తీరాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.



# సింహాద్రి నాథుని

## డిజిటల్ బోర్డు ఏర్పాటుకు సన్నాహాలు




సింహాచలం (విజయభాను న్యూస్) : సింహాద్రి నాథుని ఆలయ కార్యక్రమాలు వివిధ సంచరములు తెలియ పరిచే విధంగా స్థానిక యూనియన్ బ్యాంకు సహకారంతో తో తయారు చేసిన డిజిటల్ బోర్డులను దేవస్థానం ఇఓ ఎంవి సూర్య కళ సోమవారం పరిశీలించారు. త్వరలో వీటిని కొండపైన అలాగే విశాఖ పట్నం ఎయిర్ పోర్టులో ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. సింహాచలం బ్రాంచ్ మేనేజర్ వాసు రామ కృష్ణ అసిస్టెంట్ మేనేజర్ కిరణ్ సబ్ మేనేజర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.స్వామివారి ఆర్జిత సేవలు, ఆలయ దర్శన వివరాలు తో కూడిన ఈ బోర్డులను భక్తులకు అవగాహన కల్పించేందుకు ఉపయోగ పడతాయని ఇఓ సూర్య కళ అన్నారు.

# హిజాబ్ వస్త్రధారణ ముస్లిం మహిళల ఆత్మగౌరవం



కంచరపాలెం (విజయభాను న్యూస్) : ముస్లింల ఆత్మగౌరవాన్ని నిల బెట్టేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కొవ్వొత్తులతో ముస్లిం లు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు జీవీఎంసీ 53 వ వార్డు పరిధి మస్జిద్ - ఈ - అల్ ఖాదిర్ ఆధ్వర్యంలో స్థానిక ముస్లిం లు జాతీయ పతా కాన్ని ప్రదర్శిస్తూ కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. జాకీర్ హుస్సేన్ నగర్ , పార్వతి నగర్ , మర్రిపాలెం పరిశర ప్రాంతల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి 53 వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిజాబ్ వస్త్రధారణ ముస్లిం మహిళల ఆత్మగౌరవాన్ని రక్షించే కవచం వంటిదన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ న్యాయవాది మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ

హిజాబ్ పై కర్ణాటకలో వివాదం సృష్టించి ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. ఈ తరహ చర్యలతో ప్రజల మధ్య ఐక్యత కొరవడుతుందన్నారు. కులాలు, మతాల మధ్య ఐక్యతను కాపాడాల్సిన ప్రభుత్వాలే చిచ్చు పెట్టేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఆర్టికల్ 25 ప్రకారం మత స్వేచ్ఛను అనుభవించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. హిజాబ్ కూడా భారతీయ సంస్కృతే, మత స్వేచ్ఛ లౌకిక రాజ్యాంగం ఇచ్చిన హక్కు. దీన్ని కాదనే హక్కు ఎవరికీ లేదని హిజాబ్ కు మద్దతు తెలుపుతూ, కర్ణాటక సర్కారు వైఖరిని ఖండించారు. కర్ణాటక ఉడిపి కళాశాలలో హిజాబ్ వేసుకున్న విద్యార్థినిని కాషాయ కండువాలతో వందల మంది చుట్టుముట్టి మత విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలను ఖండిస్తున్నామన్నారు.

కార్యక్రమాన్ని మస్జిద్ కమిటీ అద్యక్షులు మున్న , కార్యదర్శి వలి పర్యావేక్షించారు . కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానిక మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### దుర్గాలమ్మ తల్లి అమ్మవారి ఆలయం 4వ వార్షికోత్సవం

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : జీ వి ఎం సి భీమిలి జోన్ 2వ వార్డు రాజలింగం పేట, డెక్కతిపాలెం గ్రామాలకి సంబంధించిన గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ దుర్గాలమ్మ తల్లి అమ్మవారి ఆలయం 4వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామ పెద్దలు బూర దుర్గా రావు, బూర శ్రీను, డెక్కతి .అప్పలరెడ్డి, గుడ్ల అప్పల నాయుడు ,కొండపు సూరిబాబు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో 2వ వార్డు నాయకులు శిల్లా వంశీ రెడ్డి ,బూర రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ కు సన్మానం చేయాలి

- కార్పొరేటర్ నుంచి ఏమ్మెల్సీ అవడం కౌన్సిల్ కు గర్వకారణం
- సిద్దార్థనగర్ లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి
- 22వ వార్డులో అత్యవసరంగా రోడ్డు మరమ్మతులు చేపట్టాలి
- మేయర్, కమిసనర్లకు వినతి పత్రం అందించిన మూర్తి యాదవ్




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : కార్పొరేటర్ గా గెలుపొంది అనతి కాలంలోనే పెద్దల సభకు వెళ్లి కౌన్సిల్ కు గర్వకారణం గా నిలిచిన ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ కు జీవీఎంసీలో ఘనంగా సన్మానించాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. కార్పొరేటర్ గా ఉంటూ ఆంధ్రప్రదేశ్ శాసన మండలికి ఎంపికయిన వంశీకృష్ణ శ్రీనివాస్ కు కౌన్సిల్ సన్మానం చేయాలని కోరుతూ సోమవారం ఆయన జీవీఎంసీ మేయర్, కమిసనర్లకు వినతి పత్రం అందజేశారు. అలాగే సిద్దార్థనగర్ లో యువత, సీనియర్ సిటిజెన్స్ కు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, 22వ వార్డులో అత్యవసరంగా రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీతల మూర్తి యాదవ్ మాట్లాడుతూ

మన విశాఖ నగర పాలక సంస్థలో 21 వ వార్డు కార్పొరేటర్ గా ఎన్నికైన చెన్నుబోయిన వంశీకృష్ణ శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి ఎంపిక కావడం మహా విశాఖ నగర పాలక సంస్థ కు గర్వకారణమన్నారు. శాసన మండలికి ఎంపికయ్యే నాటికి వంశీకృష్ణ శ్రీనివాస్ కార్పొరేటర్ గా నే ఉన్నందున ఆయనను కౌన్సిల్ తరపున గౌరవించటం మన బాధ్యతని, మంచి సాంప్రదాయమని గుర్తు చేశారు. త్వరలో జరగనున్న కౌన్సిల్ సమావేశంలో వంశీకృష్ణ శ్రీనివాస్ కు కౌన్సిల్ తరపున ఘన సన్మానం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కౌన్సిల్ నుంచి శాసన మండలి కి వెళుతున్న ఆయన విశాఖ నగర అభివృద్ధికి విశాఖ నగర పాలక సంస్థ కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి జరగాల్సిన మంచి పనులకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కౌన్సిల్లో అన్ని పార్టీల తరపున మేయర్, కమిషనర్ ల సమక్షంలో సత్కారానికి ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అలాగే 22వ వార్డులో ఎన్నో ఏళ్ళు గా రోడ్లు మరమ్మతులకు గురయ్యాయన్నారు. వార్డులోని పీతలవానిపాలెం, శివాజిపాలెం, రాజీవ్ నగర్, మంగాపురం కాలనీ, బలరాంనగర్, తారా మసీదు, నేతజినగర్, న్యూ రేసవానిపాలెం, శివానందపురం, సిద్దార్థనగర్, బాలాజినగర్, పితాపురం కాలనీ ఏరియాల్లో రోడ్లు గుంతలు పడి స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు.వార్డులోని ప్రాంతాలన్నీ సందర్శించి రోడ్లు సమస్యలు గుర్తించడం జరిగిందన్నారు. ఏరియా ప్రకారం ఇంటి నంబర్లుతో సహా 240 స్క్వేర్ మీటర్లు మేర రోడ్లు మరమ్మతులకు గురయ్యాయని గుర్తించి, ఆయా రోడ్ల వివరాలు సమర్పించామన్నారు. వార్డు ప్రజలు సమస్యలు పరిగణనలోకి తీసుకుని 240 స్క్వేర్ మీటర్లు రోడ్డు మరమ్మతులకు సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కౌన్సిల్ ఏర్పడి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ప్రతీ వార్డుకు రూ.5లక్షలు మంజూరు చేసిన మేయర్, కమిసనర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో వార్డులోని సిద్దార్థనగర్ లో జీవీఎంసీకి చెందిన 350 చదరపు గజాల ఖాళీ స్థలంలో యువత, సీనియర్ సిటీజన్లకు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, కాంపౌండ్ వాల్, పార్కు , ఎల్ఈడి లైట్లు ఏర్పాటుకు రూ.5 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరారు.

# బీచ్ రోడ్డును సుందరంగా తీర్చిదిద్దండి

## - నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఈ నెలలో జరిగే ఫ్లీట్ రివ్యూ మిలాన్-22కు బీచ్ రోడ్డును సుందరంగా తీర్చి దిద్దాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె 3, 4 జోనల్ పరిదిలో ఉన్న పార్క్ హెూటల్ నుండి కోస్టల్ బ్యాటరీ వరకు జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ ఈ నెలలో జరిగే ఫ్లీట్ రివ్యూ మిలాన్-22లో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని, బీచ్ రోడ్డును ఆకర్షణీయంగా సుందరంగా తీర్చి దిద్దాలని, బీచ్ రోడ్డులోని ఆక్రమణలను తొలగించాలని తోపుడు బళ్ళు, ఇతర దుకాణాల వాహనాలను నిరోధించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. బీచ్ రోడ్డులో ఉన్న ప్రతి గోడకు ఆకర్షణీయమైన రంగులు వేయాలని, బీచ్ గట్టుల పైన, విద్యుత్ స్తంభాల పైన, ఫ్యూజికల్ బాక్సులపైన, సేద తీరే బల్లలపైన అతికించిన పోస్టులను తొలగించాలని, బీచ్ రోడ్డులో నివాస గృహాలకు ఉన్న పబ్లిక్, ప్రైవేట్ భవనాల యజమానులతో మాట్లాడి వాటికి రంగులు వేయించాలని, వారు వేయని యెడల కార్పోరేషన్ తరుపున వేయించి, వారి వద్ద నిండి అయ్యే ఖర్చును వసూలు చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎటువైపు నుంచి చూసినా బీచ్ రోడ్డు అందంగా కనిపించాలని, డస్ట్ బిన్లు మార్చి వాటి స్థానంలో కొత్త డస్ట్ బిన్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పాడైన రోడ్లకు మరమత్తులు చేపట్టాలని, అవసరం అయినట్లైతే ఒక లేయర్ తారుతో రోడ్డు వేయాలని, విద్యుత్, ఇతర స్తంభాలన్నింటికీ రంగులు వేయాలని, నిరుపయోగంగా ఉన్న స్తంభాలను తొలగించాలని, ఇంజినీరింగు అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణ వ్యర్ధాలు రోడ్డు మార్జిన్లలో ఎక్కడ కనిపించకూడదని, ఎక్కడైనా వ్యర్ధాలు ఉంటే వాటిని వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు.

ఈ పర్యటనలో డిప్యుటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస రావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్ జి శాస్త్రి, జోన్ 3, 4 జోనల్ కమిషనర్లు శివ ప్రసాద్, బి.వి.రమణ, పర్యవేక్షక ఇంజినీరు శివప్రసాద రాజు తదితరులు పాల్గొన్నారు.



# 17న స్పందనపై జిల్లా స్థాయి వర్క్ షాప్

పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 4.30 గంటల వరకు ఈ వర్క్ షాప్ ఉంటుందని వివరించారు. మండల స్థాయిలోని తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌లు, ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు ఈ వర్క్ షాపులో పాల్గొంటారని తెలిపారు. వీరితోపాటు ఒక్కో మండలం నుంచి గ్రామ సచివాలయాలకు చెందిన డిజిటల్ అసిస్టెంట్, సంక్షేమ, విద్యా సహాయకుడు, వి.ఆర్.ఓ. తదితర ముగ్గురు సిబ్బంది మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణలో పాల్గొంటారని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో వినతులను పరిష్కరించడం, రెవిన్యూశాఖకు సంబంధించి వచ్చిన ప్రజా వినతుల పరిష్కారం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించి వీధిదీపాలు, గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు వంటి సమస్యల పరిష్కారంపై, పట్టణాల్లో ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి వచ్చే వినతులను పరిష్కరించే అంశంపై సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తారని అధికారులు, సిబ్బంది ఈ వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకొని ప్రజలకు మెరుగైన సేవలందించాలని జేసీ సూచించారు.

# ఏపీలో నైట్ కర్ఫ్యూ ఎత్తివేత..

నిపుణులైన వారికి అప్పగించాలని తెలిపారు.

గిరిజన ప్రాంతాల్లో పనిచేసే స్పెషలిస్టు వైద్యులకు, వైద్యులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్టు సీఎం వెల్లడించారు. స్పెషలిస్టు వైద్యులకు ఇస్తున్న మూలవేతనంలో 50శాతం, వైద్యులకు 30 మేర ప్రత్యేక ప్రోత్సాహకంగా ఇచ్చేలా మార్గదర్శకాలు తయారు చేసినట్టు అధికారులు సీఎం జగన్‌కు తెలిపారు.

### 'హెూదా'పై యుద్ధం చేయకుండా పలాయనవాదమెందుకు?

పై నేతలు చర్చించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడారు. కేంద్ర హెూంశాఖ అజెండాలో ప్రత్యేకహెూదా అంశం తమ ఘనతగా చెప్పుకున్న వైకాపా నేతలు.. ఇప్పుడు తెదేపాపై బురద చల్లడమేంటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ఆదాయం తగ్గకపోయినా ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని.. ఈశాన్య రాష్ట్రాల కంటే దారుణంగా ఏపీని దిగజార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### చిరంజీవిలాంటి వాళ్లు జగన్‌ను ప్రాధేయపడాలా?

లేని సమస్యలను సృష్టించి సినీ హీరోలను జగన్ ఘోరంగా అవమానించారని చంద్రబాబు ఆరోపించారు. స్వశక్తితో ఎదిగిన చిరంజీవిలాంటి వాళ్లు జగన్‌ను ప్రాధేయపడాలా అని ప్రశ్నించారు. ప్రపంచస్థాయికి ఎదిగిన తెలుగు సినీ పరిశ్రమను కించపరిచారని విమర్శించారు. గ్రామాల్లో విద్యార్థులను బడులకు దూరం చేయడమే 'నాడు-నేడు' పథకమని ఎద్దేవా చేశారు. ఉపాధిహామీ పనుల్లో అవినీతిపై తెదేపా పోరాడుతుందని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోయినా అధిక బిల్లులు వస్తుండటాన్ని చంద్రబాబు తప్పుబట్టారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశంలో ఎందుకు చేతులు కట్టుకుని కూర్చున్నారో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు.

# సాంకేతిక బదలాయింపు దిశగా అడుగులు వేస్తున్న ఏయూ

## - ఏయూ అభివృద్ధి చేసిన సాంకేతికతను వాణిజ్య పరంగా వినియోగించే దిశగా ఒప్పందం

ఆంధ్రవిశ్వవిద్యాలయం (విజయభాను న్యూస్) : సాంకేతికతను బదలాయింపు చేసే దిశగా అడుగులు వేసింది. దీనిలో భాగంగా ఏయూ అభివృద్ధి చేసిన సాంకేతికతను వాణిజ్య పరంగా వినియోగించే దిశగా ఒప్పందం చేసుకుంది. ఏయూ బయోకెమిస్ట్రీ విభాగం ఆచార్యులు డాక్టర్ అపరంజి అభివృద్ధి చేసిన సాంకేతికతను ఉపయుక్తంగా నిలుపుకుంటూ టైప్ 2 డయాబెటిస్‌ను గుర్తించే పోర్టబుల్ బయోసెన్సార్‌లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా నగరానికి చెందిన అక్షయ ఇన్నోటెక్‌తో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా అక్షయ ఇన్నోటెక్ నిర్వాహకులు శరత్ మాట్లాడుతూ ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇచ్చిన అవకాశానికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయంతో మరిన్ని అంశాలలో కలసి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి చేసిన సాంకేతికతలను వాణిజ్య అవసరాలకు ఉపయుక్తంగా మార్పు చేయడం మంచి పరిణామమన్నారు. భవిష్యత్తులో వర్శిటీ నుంచి ఇటువంటి సాంకేతికత బదలాయింపులు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, ఐపిఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.




# ఫ్లీట్ రివ్యూ నిర్వహణకు సన్నద్ధతగా ఉండాలి

## జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

విశాఖపట్టణం (విజయభాను న్యూస్) : విశాఖపట్టణం వేదికగా జరగబోయే పి.ఎఫ్.ఆర్. (ప్రెసిడెన్సియల్ ఫ్లీట్ రివ్యూ), మిలాన్ -2022 నావికా విన్యాసాలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, సన్నద్ధతగా ఉండాలని జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 21వ తేదీన పీఎఫ్ఆర్, అలాగే ఈ నెల 25 నుంచి మార్చి 4వ తేదీ వరకు జరిగే మిలాన్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.

# మహిళా సాధికారతకు పటిష్ట కృషి

## - రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ



అమరావతి (విజయభాను న్యూస్) : రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో నూతనంగా నియమించిన కమిషన్ సభ్యులతో సోమవారం ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత సాధనకు విస్తృతంగా కృషిచేసేందుకు కమిషన్ తరఫున కంకణబద్ధులై ఉన్నామని చెప్పారు. ఇప్పటికే ఇద్దరు సభ్యులు ( గజ్జల వెంకట జయలక్ష్మి, కర్రి జయశ్రీ) ఉండగా.. ప్రస్తుతం మరో ముగ్గురుతో కమిషన్ బలోపేతమైందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తమపై ఉంచిన గురుతర బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామని వాసిరెడ్డి పద్మ అన్నారు.

**ముగ్గురు సభ్యులచే ప్రమాణ స్వీకారం**

మహిళా కమిషన్ సభ్యులుగా ఈనెల (ఫిబ్రవరి)2వ తేదీన మహిళా శిశు సంక్షేమశాఖ కమిషనరు జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం నియమితులైన ముగ్గురు సభ్యుల్లో గడ్డం ఉమ (విశాఖపట్నం), బూసి వినీత (తణుకు), డాక్టర్ షేక్ రుకియాబేగం (గుంతకల్లు) ప్రమాణ స్వీకారం చేశారు. చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మతో పాటు మిగతా సభ్యులకు గుంతకల్లు ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కమిషన్ సీనియర్ సభ్యులుగా కొనసాగుతున్న గజ్జల వెంకట జయలక్ష్మి, కె. జయశ్రీ, కమిషన్ సెక్రటరీ శైలజ, డైరెక్టర్ ఆర్ సూయజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటీఎస్ ప్రక్రియలో పెండింగ్ పనులను పూర్తి చేయండి

## జాయింట్ కలెక్టర్ (హౌసింగ్) కల్పనా కుమారి



విశాఖపట్టణం,(విజయభాను న్యూస్) : ఓటీఎస్ (ఒన్ టైం సెటిల్మెంట్) పథకంలో భాగంగా చేపట్టిన డేటా నమోదు ప్రక్రియలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ (హౌసింగ్) కల్పనా కుమారి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఓటీఎస్ పథకం అమలు, ఇతర పనుల ప్రగతిపై సమీక్షించేందుకు ఆమె సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో మొత్తం 3.24 లక్షల లబ్ధిదారులు ఉండగా 2.80 లక్షల మంది వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదై ఉన్నాయని పేర్కొన్నారు. మిగతా దరఖాస్తులకు సంబంధించి పరిష్కారాలను త్వరితగతిన చూపాలని, సంబంధిత వివరాలను అప్‌లోడ్ చేయాలని ఈ సందర్భంగా సూచించారు. అభ్యంతరాలు, డూప్లికేట్ దరఖాస్తులు ఉన్నచో పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో లాగిన్‌లో తొలగించాలని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని పేర్కొన్నారు. వివరాలు సరిగా లేని దరఖాస్తులను, డేటా సరిపోలని దరఖాస్తులను తిరస్కరించవచ్చని సూచించారు. తహశీల్దార్, ఎంపీడీవో, గృహ నిర్మాణ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఓటీఎస్ ప్రక్రియలో ఆశాజనక ఫలితాలు సాధించాలని జేసీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐటీ మేనేజర్ ప్రకాశ్, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

## వినియోగదారుల అవగాహన సైబర్ బెదిరింపులు మరియు మోసాలు



(విజయభాను న్యూస్) : ప్రజలందరికి ఆర్థిక అక్షరాశ్యతపై అవగాహన కల్పించే భాగముగా భారతీయ రిజర్వు బ్యాంకు, ఈనెల 14 తేదినుండి 18 తేదీవరకు అక్షరాశ్యత వారోత్సవాలను నిర్వహించడానికి నిశ్చయిం చింది. 2016 సంవత్సరము నుండి రిజర్వు బ్యాంకు ప్రతిసంవత్సరము ఈవిధమైన కార్యక్ర మాలను నిర్వహిస్తోంది. ఈసంవత్సరం వినియోగదారుల అవగాహన సైబర్ బెదిరింపులు మరియు మోసాలు అనుఅంశముపై, వినూత్న పద్ధతులను ఉపయోగించి సోషల్ మీడియా టెక్నిక్కులు మరియు మొబైల్ టెక్నాలజీ మొదలైన వాటితో ప్రజలను మోసము చేస్తున్న మరియు తప్పుదారి పట్టిస్తున్న అసాంఘిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిశ్చయించారు. కావున ప్రజలందరూ ఈ కార్యక్రమములలో పాలుపంచుకొని, జాగరూకతతో డిజిటల్ లావాదేవీలను నిర్వహించే పద్ధతులను తెలుసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ వేణుగోపాల్ రెడ్డి కోరారు. ఈ రోజు (14.02.2022) దీనికి సంబందించిన రిజర్వుబ్యాంకు వారి పోస్టర్లను జాయింట్ కలెక్టరు, కలెక్టరు ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్ నందు ఆవిష్కరించారు.



**విశాఖ ఉత్తర నియోజకవర్గం 47వార్డు తిక్కవాని పాలెం గ్రామం శ్రీశ్రీశ్రీ సంపత్ వినాయక పార్వతి విశ్వేశ్వర ఆలయం 22వ వార్షికోత్సవంలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వైసీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, నర్సింగరావు, శశి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు.ఈ వార్షికోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.**

# గీతం ఎంబిబిఎస్ తరగతులు ప్రారంభం



సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) వైద్య కళాశాలలో 2021-22 విద్యా సంవత్సరం ఎంబిబిఎస్ తరగతులు సోమవారం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ ప్రారంభిం చారు. నీట్ యుజి ప్రవేశ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి జాతీయ స్థాయి మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ (ఎమ్‌సిసి) ద్వారా గీతంలో ప్రవేశం పొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. సమాజానికి ఎంతో ఉపయోగపడే వైద్య వృత్తిని అభ్యసించే వారు నైపుణ్యాలను పెంచుకోవడానికి కృషి చేయాలని ముఖ్యంగా మార్కుల కోసం కాకుండా వృత్తిని ప్రేమిస్తూ ఉన్నత శిఖరాలను చేరాలని సూచించారు. ఇంజనీరింగ్, లా, మేనేజ్‌మెంట్, సైన్స్, ఫార్మసీ వంటి బహుముఖ కోర్సులు గల గీతంలో వైద్య విద్యను అభ్యసించడం విద్యార్థులకు అరుదైన అవకాశం అన్నారు. జిమ్‌సర్ ప్రో- వైస్ చాన్సలర్ డాక్టర్ సి.వి.రావు మాట్లాడుతూ జాతీయ వైద్య మండలి (ఎన్ఎమ్‌సి) వైద్య విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. వైద్య విద్యను నేరుగా తరగతులకు హజరవుతూ ఆస్పత్రి పరిజ్ఞానం పెంచుకుంటూ నేర్చుకోవలసి ఉంటుందని పేర్కొన్నారు. వైద్య విద్యను ఆన్‌లైన్ పరీక్షలకు దూరంగా ఉంచడం ద్వారా ఎన్ఎమ్‌సి సరైన నిర్ణయం తీసుకుందన్నారు. జిమ్‌సర్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతిపద్మజ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల ప్రవేశంతో గీతం మినిఇండి యాగా మారిందన్నారు. ఎన్ఎమ్‌సి నిర్ణయం ప్రకారం ఈ ఏడాది నుంచి వైద్య విద్యార్థులు విధిగా 10 ఔషధ మొక్కలు పెంచాలని, 10 రకాల యోగా ఆసనాలను నేర్చుకోవలసి ఉంటుందన్నారు. ఎన్ఎమ్‌సి ఆదేశాల మేరకు విద్యార్థులలో సాఫ్ట్ స్కిల్స్ పెంచడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇక పై వైద్య విద్యార్థులకు విద్యా సంవత్సరంలో కేవలం 15 సెలవ దినాలు మాత్రమే ఉంటాయని పేర్కొన్నారు. అలాగే ఎమ్‌బిబిఎస్ సీట్ల భర్తీతో పాటు ఈ ఏడాది నుంచి జాతీయ వైద్య మండలి (ఎన్ఎమ్‌సి) అనుమతించిన 9 ఎమ్.డి. పి.జి కోర్సులకు, 5ఎమ్.ఎస్ కోర్సులకు అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని అమె తెలిపారు. కార్యక్రమంలో జిమ్‌సర్ ఆసుపత్రి సూపరెంటెండెంట్ డాక్టర్ ద్వారకానాథ్, గీతం కేంపస్ లైఫ్ ప్రో-వైస్ ఛాన్సలర్ వై. గౌతమ్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ విశాఖ పై పాటలు ఆవిష్కరించిన నగర్ మేయర్, కమిషనర్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : స్వచ్ఛ విశాఖపై పాటలను నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ ఆవిష్కరించారు. సోమవారం, వారు జివిఎంసి పాత సమావేశ మందిరంలో డి.సి.(రెవెన్యూ) పల్లి నల్లనయ్య రచించిన స్వచ్ఛ విశాఖపై, మన కోసమే ఈ జివిఎంసి ఉంది అనే పాటల డివిడిని ఆవిష్కరించారు. ఈ స్సాదర్భంగా వారిరువురూ గాయకులూ టి. కృష్ణా రావు, మూల లలితశ్రీ, సంగీతం వేణుమాధవ్, నిర్మాతలు బి. నరసింహ మూర్తి, పల్లి నాగాభూషన్ లను సత్కటించి అభినందించారు. డి.సి.(రెవెన్యూ) పి. నల్లయ్యను ఇంకా జివిఎంసి కి ఉపయోగపడే పాటలను రచించాలని అభినందిస్తూ సత్కరించారు.

పాటలు వినడానికి ఇంపుగా ఉండటంతో పాటూ విశాఖ నగర అభివృద్ధి పట్ల మన అందరి బాధ్యతా ఎంత ఉన్నదో పాటల ద్వారా తెలియపరిచారు. ఈ పాటలను ప్రజలకు చేరువ చేసి వారిని స్వచ్ఛ సర్వేక్షణ్ - 2022లో చైతన్యవంతులుగా తీర్చిదిద్దడానికి దోహదపడుతుందని తెలిపారు. ఈ పాటలు ఆవిష్కరించిన కార్యక్రమంలో డిప్యుటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, ఫ్లోర్ లీడరు బాణాల శ్రీనివాస రావు, జివిఎంసి ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com